మొదటి పేజి తరువాయి

## మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు

మున్సిపాలిటీలకు కొత్త రూపం..

ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అనిత

వాటికి బడ్జెట్ లో చేసిన కేటాయింపులను వివరించారు. బడ్జెట్ కేటాయింపులు: 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.27,719 కోట్లు, దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతుకి రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు, ఉపకారవేతనాలు రూ.3,836 కోట్లు, రూ.సమగ్ర శిక్ష 2,946 కోట్లు, రూ.ఉన్నత విద్య 2,566 కోట్లు కేటాయించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.2,161 కోట్లు, మన బడి, మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి రూ.1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ.654 కోట్లు, యువత, క్రీడలకు రూ.438 కోట్లు, వీబీజీ రామ్‌జీకి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణం రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ రూ.4,000 కోట్లు, జల్‌జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, ఆయుష్మాన్ భారత్ రూ.838 కోట్లు కేటాయించారు. వ్యవసాయ బడ్జెట్: వ్యవసాయ బడ్జెట్ ను శాసన మండలిలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శాసన మండలిలో ప్రవేశపెట్టారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయించిన నిధులు, ప్రాధాన్యతలను వివరించారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు బడ్జెట్ లో రూ.53,752.12 కోట్లు కేటాయించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్లు ప్రవేశపెట్టాక మండలి సమావేశాలను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేస్తూ ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు ప్రకటించారు.

## కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది
## హస్తం పార్టీపై మోదీ విమర్శలు

మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ. 10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.

## కుట్రలు చేస్తే... మీ అందరినీ రాజకీయ సమాధి చేస్తా

అని వ్యంగ్యంగా అన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ స్థానాలు వచ్చినప్పటికీ... మేయర్ పీఠం దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ చెబుతున్నాయని... ఏ విధంగా దక్కించుకుంటాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని చెప్పారు. కరీంనగర్ మేయర్ పీఠం తమదేనని బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తే... కరీంనగర్ నుంచే యుద్ధాన్ని ప్రారంభిస్తానని హెచ్చరించారు. వారందరినీ రాజకీయ సమాధి చేస్తానని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ కార్యకర్తల శక్తి, దమ్ము మీకు తెలియదు అని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో బీజేపీకి కేవలం 13 సీట్లే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చిందని సంజయ్ తెలిపారు. అందుకే, ఈ విజయాన్ని ఇంటెలిజెన్స్ కే అంకితమిస్తున్నామని అన్నారు. మేయర్ పదవి కోసం గుంటనక్కలన్నీ ఏకమయ్యాయని మండిపడ్డారు. బీజేపీ సింహమని, సింగిల్ గానే వస్తుందని చెప్పారు. మరోవైపు, కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా... బీజేపీ 30 డివిజన్లలో జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 స్థానాలకే పరిమితమయ్యాయి. ఈ నెల 16న కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం ఉంటుంది.

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామన్న జనసేన

మంచిర్యాల్ కార్పొరేషన్‌లో 34వ డివిజన్ నుండి జనసేన కార్పొరేటర్ అభ్యర్థి అగ్గు సాగర్ 31 ఓట్ల మెజార్టీతో, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 14వ వార్డు నుండి 29 ఓట్ల మెజారిటీతో ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు విజయం సాధించారని తెలిపారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలలో పార్టీకి ఓటేసిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల కోసం పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, వీర మహిళలు అందరూ ఎంతో కష్టపడి పనిచేశారని అన్నారు. తక్కువ సమయంలోనే పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించిన వారందరికీ ఆయన పవన్ కల్యాణ్ తరపున, రాష్ట్ర నాయకుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పార్టీ ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ, రెండు చోట్ల గెలవడం సంతోషకరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమం స్ఫూర్తితో పవన్ కల్యాణ్ పార్టీని స్థాపించారని పార్టీ రాష్ట్ర నాయకులు రాజలింగం అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తామని సీనియర్ నాయకుడు ఆర్కే సాగర్ అన్నారు. తెలంగాణలో జనసేన బోణీ కొట్టిందని మరో నాయకుడు ప్రేమ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని అన్నారు.

## తెలంగాణ ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు

తాము ఒక రాజకీయ పార్టీగా అవతరించబోతున్నామనే విషయాన్ని ఇప్పటికే ప్రకటించామని తెలిపారు. తమ పార్టీని అధికారికంగా ప్రకటించక ముందే... మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేద్దామని చివరి నిమిషంలో తమ కార్యకర్తలు కోరారని... వారి కోరిక మేరకు తాము ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై ఎన్నికల బరిలోకి దిగామని వెల్లడించారు. సొంత పార్టీ తరపున పోటీ చేయకపోయినప్పటికీ... తెలంగాణ ప్రజలు తమను మంచి ఫలితాలతో ఆదరించారని తెలిపారు. ఎన్నికల్లో తాము ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకున్నామని, మరో మున్సిపాలిటీలో వైస్ ఛైర్మన్ పదవిని దక్కించుకోబోతున్నామని కవిత చెప్పారు. మరో 40 చోట్ల తమ కార్యకర్తలు దాదాపుగా గెలుపు అంచుల వరకు వచ్చారని అన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు తమ పార్టీ భవిష్యత్తుపై భరోసాను కల్పించాయని చెప్పారు. అహంకారం లేని, అత్యంత పారదర్శకమైన రాజకీయాలను అందిస్తామని తాము పదేపదే చెబుతున్నామని... ప్రజలు తమను విశ్వసించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా తమకు ప్రజల మద్దతు ఇలాగే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో తాము ప్రధాన భూమికను పోషిస్తామని తెలిపారు.

## నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను
## మేమే కైవసం చేసుకుంటాం

రాబోయే రోజుల్లో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. మతాన్ని రెచ్చగొట్టినా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన పట్టును మరింత పెంచుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## దెబ్బతీసిన రెబెల్స్ - బరిలోకి దిగి
## సత్తా చాటిన స్వతంత్ర అభ్యర్థులు

ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో పలు చోట్ల రెబెల్స్ సత్తా చాటారు. తమకు వార్డు సభ్యుడిగా పోటీ చేసేందుకు సీటు కావాల్సిందేనని కొందరు పట్టుబట్టారు. ప్రధాన పార్టీలు ససేమిరా అనడంతో వారు తమ బాధ్యతలను వదులుకుని స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా పోటీ చేసిన అభ్యర్థులుగా బరిలోకి దిగారు. కొన్నిచోట్ల బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. జగిత్యాలలో మొత్తం 9 మంది కాంగ్రెస్ రెబెల్స్ విజయం పతాకం ఎగురవేశారు. వారందరు ఎవరా అని ఆరాతీయగా మంత్రి జీవన్ రెడ్డి అనుచరులే కావడం గమనార్హం. అక్కడ బీజేపీ రెబెల్స్ మరో ముగ్గురు విజయఢంకా మోగించారు. సూర్యాపేట మున్సిపాలిటీలో 6 మంది, కోదాడలో ముగ్గురు, హుజూరాబాద్ లో ఇద్దరు, కామారెడ్డిలో ముగ్గురు కాంగ్రెస్ రెబెల్స్ సత్తా చాటారు. 2వ డివిజన్ లో బీఆర్ ఎస్ రెబెల్ కారణంగా అక్కడ ఆ పార్టీ ఓటమికి గురయ్యింది. బీఆర్ ఎస్ అభ్యర్థి చంద్రయ్యకు 938 ఓట్లు రెబెల్ అభ్యర్థి దాసరి సాగర్ కు 1,535 వచ్చాయి. దాంతో అక్కడ 1,703 ఓట్లు పొందిన బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ విజేతగా నిలిచారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో 114 వార్డుల్లో కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థుల కారణంగా రెండు చోట్ల ఓడిపోయింది. ఒకటో వార్డులో కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి కాంతయ్యపై బీజేపీ అభ్యర్థి సిద్ధార్థ గెలిచాడు. 14 వార్డులో ఇద్దరు కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థులు 290 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి అడ్డగూరి

# 16న బిల్ గేట్స్ అమరావతి వస్తున్నారు 3సార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత నాదే


మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ లో ఒకప్పుడు జూబ్లీహిల్స్ దాటితే మొత్తం అడవిలా ఉండేదని, 1982లో జూబ్లీహిల్స్ లో ఇప్పుడు బాలకృష్ణ ఉంటున్న ఇంటి స్థలంలో తనకు ఇల్లు కట్టిస్తానని ఎన్టీఆర్ చెప్పారని గుర్తుచేశారు. అప్పుడు తాను మంత్రిగా ఉండి స్థలం చూసేందుకు వెళ్తే మొత్తం అడవిలా ఉందని తెలిపారు. ఇక్కడికి ఆటోలు కూడా రావని పెద్దాయనతో సున్నితంగా వద్దని చెప్పానన్నారు. ఆ తర్వాత అక్కడ బాలకృష్ణకు ఇల్లు కట్టించి ఇచ్చారని, నాలుగేళ్లలోనే అక్కడి పరిస్థితులు చాలా మారిపోయాయని చంద్రబాబు వివరించారు. సినీ హీరోగా బిజీగా ఉంటూ బాలకృష్ణ చెన్నైలో ఉంటే తాను 4ఏళ్లు అదే ఇంటిలో ఉన్నానని చెప్పారు. జూబ్లీహిల్స్ లో అక్కడికి సమీపంలో తన ఇల్లు పూర్తయ్యాక అప్పుడు అక్కడికి మారానన్నారు. అమరావతి అభివృద్ధిలోనూ ఇలాంటి గణనీయ మార్పులే ఉంటాయని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుతో కీలక భేటీ! : బిల్ గేట్స్ ఫిబ్రవరి 16న ఆంధ్రప్రదేశ్ ు రానున్నారు. మొదట ఈ పర్యటన ఈనెల 18వ తేదీన ఉంటుందని అందరు భావించినా 2రోజుల ముందుగానే ఆయన రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ పర్యటన రాష్ట్రంలో ఒక్క రోజే ఉంటుందా? లేక రెండు రోజులు? ఉంటారా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. బిల్ గేట్స్ ఏపీ పర్యటనలో భాగంగా పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమీక్షలో పాల్గొంటారని సమాచారం. రాష్ట్రంలో విద్య, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలకు ాx పరిజ్ఞానాన్ని అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే ఓ ఒప్పందాన్ని సైతం కుదుర్చుకుంది. అదేవిధంగా అత్యుత్తమ సాంకేతికత ద్వారా ప్రజల ఆరోగ్య అంశాలను పర్యవేక్షించేలా ప్రాజెక్టును కూడా చేపట్టింది. అంతేగాక బిల్ గేట్స్ ఫౌండేషన్ చేయూతతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేయనుంది. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇలాంటి విషయాలతో పాటు మరికొన్నివాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమావేశంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ చర్చిస్తారని సమాచారం. అలాగే రాజధాని అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ పెట్టే పెట్టుబడులపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనంతరం ఫిబ్రవరి 19వ తేదీన దిల్లీలో జరిగే ాx సమిట్‌లో బిల్ గేట్స్ పాల్గొంటారు. సీఎం చంద్రబాబు సైతం ఈ సదస్సుకు హాజరవుతారు. అమరావతిలో భారీ క్వాంటమ్ కంప్యూటర్ : ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి టెక్నాలజీలో సరికొత్త గుర్తింపుని తీసుకొచ్చేందుకు క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ రాష్ట్రంలో రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిట్ సామర్థ్యమున్న (50 లాజికల్ క్యూబిట్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో అధికారులు జరిపిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయి. మైక్రోసాఫ్ట్ కోసం క్వాంటమ్ వ్యాలీలో 4 వేల చ.అ. విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

# శ్రీశైలంలో పాగాలంకరణ సేవ

మొదటి పేజి తరువాయి

ముఖ మండపాల నందులకు పాగాలంకరణ: శ్రీశైలం మహాక్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ విమాన గోపురం, ముఖ మండపాల నందులకు పాగాలంకరణ చేయడం అనాదిగా కొనసాగుతోంది. బాపట్ల జిల్లా హస్తినాపురం గ్రామానికి చెందిన చేనేతలు బ్రహ్మోత్సవాల్లో పాగాలంకరణ క్రతువు చేపట్టడం సంప్రదాయంగా వస్తోంది. కొన్నేళ్ల కిందటి వరకు హస్తినాపురం గ్రామానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు అనే వృద్ధుడు మల్లికార్జున స్వామి ఆలయానికి పాగాలంకరణ చేసేవారు. ఆయన శివైక్యం చెందిన తర్వాత ఆయన కుమారుడు పృథ్వీ సుబ్బారావు పాగాలంకరణ చేస్తున్నారు. కార్తీక మాసం నుంచి మొదలుపెట్టి మాఘమాసంలో వచ్చే మహా శివరాత్రి వరకు కొన్ని రోజుల ముందు నుంచే ప్రతిరోజు భక్తిశ్రద్ధలతో చేనేత మగ్గాల ద్వారా నూలుతో కూడిన పాగా వస్త్రాన్ని పృథ్వీ సుబ్బారావు కుటుంబ సభ్యులు తయారుచేస్తారు. మూడు మూరల వెడల్పు, 300 మూరల పొడవుతో పాగా వస్త్రాన్ని సిద్ధం చేశారు. పాగ ఉండలను ఇప్పటికే శ్రీశైలానికి తీసుకు వచ్చారు. పృథ్వీ సుబ్బారావుతో పాటు మరికొందరు చేనేతలు సైతం పాగా వస్త్రాన్ని తయారుచేసి శ్రీశైలం దేవస్థానానికి అప్పగించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీశైలంలో పాగాలంకరణ సేవ: శివరాత్రి నాడు ప్రత్యేక క్రతువు మేము ప్రతీ సంవత్సరం మహా శివరాత్రి పర్వదినం రోజున శ్రీశైలంలో కొలువైన స్వామివారి ఆలయానికి పాగాలంకరణ చేస్తాం. మా తండ్రి సుమారు 60 సంవత్సరాలు పాగాలంకరణ చేశారు. సుమారు మూడు సంవత్సరముల నుంచి మా పూర్వీకులు పాగాలంకరణ చేస్తున్నారు. మా తండ్రి గత సంవత్సరం శివైక్యం చెందారు. భక్తి శ్రద్ధలతో నేను ఈ పాగాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తాను. శివరాత్రి రోజు రాత్రి సమయంలో 10 నుంచి 12 గంటల వరకు మల్లన్న ఆలయానికి పాగాలంకరణ చేస్తాం. మూడు మూరల వెడల్పు, 300 మూరల పొడవుతో పాగా వస్త్రాన్ని సిద్ధం చేస్తాం. స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరించడమే ఈ పాగాలంకరణ కార్యక్రమం.-పృథ్వీ సుబ్బారావు. మల్లన్న ఆలయానికి పాగాలంకరణ చేసే చేనేత భక్తుడు పాగాలంకరణ చూసేందుకు భక్తుల అమితాసక్తి: రేపు మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మల్లికార్జున స్వామి ఆలయానికి చేసే పాగాలంకరణను చూసేందుకు భక్తులు అమితమైన ఆసక్తి చూపిస్తారు. రేపు రాత్రి 10 నుంచి 12 గంటల వరకు మల్లన్న ఆలయానికి పాగాలంకరణ జరుగుతుంది. ఆ సమయంలో ఆచార సాంప్రదాయాలను అనుసరించి ఆలయం లోపల విద్యుత్ దీపాలను ఆర్పి వేస్తారు. పృథ్వీ సుబ్బారావు దిగంబరుడై, మల్లికార్జున స్వామి బంగారు విమాన గోపురం పై భాగాన ఉన్న త్రిశూలం వద్ద నుంచి కింద వైపున ఉన్న నందుల వరకు పాగాలంకరణ చేయనున్నారు. అదే సమయంలో ఆలయంలో లోపల శ్రీ మల్లికార్జున స్వామికి దేవస్థానం అర్చకులు లింగోద్భవకాల మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. పాగాలంకరణ పూర్తయిన తర్వాత విద్యుత్ దీపాలను వెలిగిస్తారు. ఆ సమయంలో భక్తులు పాగాలంకరణతో దర్శనమిచ్చే మల్లన్న ఆలయానికి నమస్కరించుకొని ఆధ్యాత్మిక తన్మయత్వం చెందుతారు. ఆ తర్వాత నిత్య కళ్యాణ మండపంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి బ్రహ్మోత్సవ కళ్యాణం




జరగనుంది. శివుడు తలపాగా ధరించినట్లు: బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన పాగాలంకరణను తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. మహా శివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో ఆలయంపై నవ నందులను కలుపుతూ తెల్లని వస్త్రాన్ని చుట్టడమే పాగాలంకరణ. ఈ అలంకరణతో శివుడు తలపాగా ధరించినట్లు భక్తులు భావిస్తారు. స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరించడంలో భాగంగానే ఈ క్రతువు చేపడతారు. పాగా తయారీకి ఏటా కార్తిక మాసంలో అంకురార్పణ చేసి, సంక్రాంతికి నేత పూర్తి చేస్తారు. సుమారు 3 నెలల పాటు అత్యంత నియమ నిష్ఠలతో సొంత మగ్గంపై 300 మూరలు నేస్తారు. నేతపని పూర్తయ్యే వరకు మాలధారణ భక్తులు పాటించే అన్ని నియమాలు పాటిస్తారు.

# ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

మొదటి పేజి తరువాయి

యూపీఏ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు, భారత సైనికులపై తీవ్ర స్థాయిలో దాడులు జరిపారని ఆరోపించారు. కానీ మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన సైనికులు, శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదులను అంతమొందించారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని కారైకల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో అమిత్ షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళు లర్పించారు. "పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పిస్తున్నాను. కాంగ్రెస్ పాలనలో, పాకిస్థాన్ ఉగ్రవాదులు ప్రతిరోజూ మన సైనికులపై దాడి చేసేవారు. దీనిపై దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా రక్షణ మంత్రి నుంచి ఎటువంటి స్పందన ఉండేది కాదు. కానీ పుల్వామా దాడికి ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం వైమానిక దాడులు చేసింది. పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించి, ఉగ్రవాద స్థావరాలను మట్టికరిపించింది. ప్రధాని మోదీ హయాంలో మొదట సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్ పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చింది"

**- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి**



మీ ముందు రావడానికి రెండు కారణాలు ఉన్నాయి: అమిత్ షా

మరోవైపు, పుదుచ్చేరిలోని బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్న అమిత్ షా ఆ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు రావడానికి రెండు లక్ష్యాలు ఉన్నాయని షా పేర్కొన్నారు. అందులో మొదటిది మోదీ, రంగ స్వామి నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచడానికని, రెండోది అవినీతి శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కూటమిల ముసుగును బయటపెట్టడానికని షా వ్యాఖ్యానించారు. "ఐదు సంవత్సరాల క్రితం, పుదుచ్చేరి ప్రజలు ప్రధాని మోదీ, రంగస్వామి నాయకత్వంలో ఇక్కడ ఎన్ డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. భారత్ ను సుసంపన్నంగా, సురక్షితంగా మార్చడానికి ప్రధాని మోదీ కృషి చేశారు. పుదుచ్చేరి ప్రజలు ఎన్ డీఏ, బీజేపీ, రంగస్వామి, ప్రధాని మోదీపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, పుదుచ్చేరి ప్రజలు 44% ఓట్లను గెలుచుకుంది. కానీ ఈసారి బీజేపీ, ఎఐఎన్ ఆర్ సీ, ఎఐఎడీఎంకే కూటమి 60% ఓట్లతో సీట్లను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పుదుచ్చేరిలో ఎన్ డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానంగా మూడు పనులు చేసింది. అందులో మొదటిది అవినీతిని అంతం చేయడం, రెండోది పుదుచ్చేరిని స్వయంప్రతిపత్తి కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం, మూడోది పుదుచ్చేరికి రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం వంటి పనులు చేసింది." అని అమిత్ షా పేర్కొన్నారు.

### జవాన్ల ప్రాణ త్యాగాలను భారత్ ఎన్నటికీ మరచిపోదు!

ఇదిలా ఉండగా, 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. జవాన్ల ప్రాణ త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టే మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువని, దానిని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు.

# అమెరికా ఒప్పందంపై ప్రధాని, మంత్రులు భ్రమలు కల్పిస్తున్నారు

మొదటి పేజి తరువాయి

పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు. "భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు 0% పన్ను, భారత్‌కు 18% పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడు."రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత మోదీ ప్రభుత్వం పత్తి, వస్త్ర రంగాలకు నష్టం కలిగించింది! ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు.

### భారత్ - అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం!

గత వారం భారత్ -అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్ పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రతిగా, యునైటెడ్ స్టేట్స్ వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎంపిక చేసిన భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలను వర్తింపజేయనుంది. అయితే ఒప్పందం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలు వంటి వస్తువులపై అమెరికా విధించిన సుంకాలు తొలగిపోనున్నాయి.

# ఈశాన్యంలో చారిత్రక ఘట్టం- తొలి 'ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ'

ఈశాన్య భారతంలో తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ హైవే ప్రారంభం

ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై సీ130 జే విమానంలో దిగిన ప్రధాని- చైనా సరిహద్దుల్లో కీలకంగా మారనున్న ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ఈశాన్య రాష్ట్రం అసోం చారిత్రక ఘట్టానికి సాక్షిగా నిలిచింది. అసోంలో ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటిటీ(ఇఎల్ఎఫ్)ను శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. దిబ్రూగఢ్‌లోని మోరాన్ బైపాస్ వద్ద తీర్చిదిద్దిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై సీ130జే విమానంలో మోదీ ల్యాండయ్యారు. తొలుత చబువా ఎయిర్‌ఫీల్డ్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ సీ 130 జే విమానం ఎక్కి మోరాన్ బైపాస్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిలో దిగారు. అదే ఈఎల్ ఎఫ్ పై ఆధునిక యుద్ధ విమానాలైన రఫేల్, సుఖోయ్-30, హెలికాప్టర్ల విన్యాసాలను ఆయన తిలకించారు. దాదాపు 40 నిమిషాలు పాటు ఈ విన్యాసాలు జరిగాయి. అంతుకుముందే ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ గురించి ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు. చైనా సరిహద్దులకు సమీపంలో దేశ రక్షణకు ఈ ఈఎల్ ఎఫ్ కీలకం కానుంది. 4.2 కిలోమీటర్ల పొడవైన ఈ హైవే కోసం దాదాపు 100 కోట్లు ఖర్చు చేశారు. అత్యవసర సమయాల్లో సైనిక, పౌర విమానాల ల్యాండింగ్, టేకాఫ్ కోసం భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సమన్వయంతో ఈ ఈఎల్ ఎఫ్ ను ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. దీని వల్ల సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు జరిగినప్పుడు భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు అవకాశం ఉంటుంది. 40 టన్నుల వరకు యుద్ధ విమానాలను, 74 టన్నుల గరిష్ఠ టేకాఫ్ బరులవు గల రవాణా విమానాలను నిర్వహించగలదు. టేకాఫ్, ల్యాండింగ్ కు అనుకూలంగా దీనిని రూపొందించారు. ఇప్పటికే పశ్చిమ, ఉత్తర, మధ్య భారత్ లో ఈ ఈఎల్ ఎఫ్ లు ఉన్నాయి. రూ. 5,450 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇవి ఈశాన్య ప్రాంతంలో కనెక్టివిటీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఉన్న విద్య వంటి అంశాలను బలోపేతం చేసే లక్ష్యంగా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం బ్రహ్మపుత్ర నదిపై వంతెనను, ఈశాన్య ప్రాంతానికి డేటా సెంటర్ సహా అసోంలోని పలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించనున్నారు. బ్రహ్మపుత్రపై దాదాపు రూ.3,030 కోట్ల వ్యయంతో నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతును ప్రధాని ప్రారంభిస్తారు. 2019 ఫిబ్రవరి 9న ఈ వంతెనకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే పీఎం-ఈబస్సు సేవా కింద 225 ఎలక్ట్రిక్ బస్సులను కూడా ప్రారంభించనున్నారు. మరోవైపు ప్రధాని మోదీ అసోం పర్యటనపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఉద్రికత్తలు జరుగుతున్న మణిపూర్ కాకుండా మోదీ అసోం పర్యటించడాన్ని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా విమర్శించారు. అసోం నుంచి మణిపూర్ కు కేవలం గంటలో వెళ్లొచ్చని అన్నారు. మణిపూర్ కు వెళ్లాలని, ప్రధాని హామీ ఇస్తే ప్రజలు నిర్భయంగా ఉంటారని తెలిపారు. తాము ప్రధానికి విమానం టికెట్ కూడా బుక్ చేశామని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. '2023 నుంచి మణిపూర్ లో అల్లర్లు జరుగుతూనే

# సంపాదకీయం

## సమరీతిలో లేని ఇచ్చిపుచ్చుకోవడాలు!

అమెరికా, భారత్‌ల మధ్య వాణిజ్య చర్చలు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చాయి. ఉభయ దేశాల ప్రభుత్వాలు 2026 ఫిబ్రవరి 6న ఒక సంయుక్త ప్రకటన జారీ చేశాయి. 'అది ఏమిటి?'. ఇది ఆ సంయుక్త ప్రకటనకు యోగ్యమైన ప్రశ్న. ఆ సంయుక్త ప్రకటన అంతులేని ఊహాగానాలను పురిగొల్పింది. దానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భారత ప్రభుత్వం వాణిజ్య ఒప్పందం వివరాలను విపులంగా వెల్లడించకపోవడం వల్ల ఆ అనుమానాలు పెరిగాయేగానీ తొలగిపోలేదు, తగ్గలేదు. ఉభయ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఎలా ఉండాలనే విషయాన్ని ప్రభావదాయకంగా నిర్ణయించిందీ, నిర్దేశించిందీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నది నిరాకరించలేని వాస్తవం. కనుక ఆ సంయుక్త ప్రకటనలోని అంశాలు అమెరికాకు ఆందోళన కలిగించకపోవచ్చు గానీ భారత్‌కు తప్పకుండా కలవరం కలిగిస్తున్నాయి. ఉభయ దేశాల మధ్య వాణిజ్య చర్చలలో పాల్గొన్న భారత్ ప్రతినిధులు గత ఏడాది తాము అమెరికాతో ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే విషయమై సంప్రదింపులు జరుపుతున్నామని పదే పదే ప్రకటించారు. సమీప భవిష్యత్తులోనే అమెరికాతో ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదరనున్నదని భారత వాణిజ్య మంత్రి స్వయంగా అనేక మార్లు చెప్పారు. 2025 సంవత్సరాంతంలోగానే ఇండోఅమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తప్పక ఖరారు అవుతుందని కూడా ఆయన ప్రకటించారు. తీరా కొద్దిరోజుల క్రితం సంయుక్త ప్రకటన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కాదు. అది ఒక మధ్యంతర ఒప్పందం కూడా కాదు; అది ఒక మధ్యంతర ఒప్పందానికి ఒక చట్రం మాత్రమే. కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నాం సుమా! సంయుక్త ప్రకటన జారీ అయిన తరువాత అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందం పరస్పర ప్రయోజనకరమని ఇరు పక్షాలూ ప్రకటించాయి. ఈ వాదన పాఠకుని ఇంగితాన్ని అవమానపరచడమే. సంయుక్త ప్రకటనను పైపైన పరిశీలించినా సదరు ఒప్పందం పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికన లేనే లేదని స్పష్టమవుతుంది. ఇప్పుడు ఆ సంయుక్త ప్రకటనను నిశితంగా చూద్దాం: అమెరికా పారిశ్రామిక సరుకులు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తులలో చాలా వాటిపై భారత్ సుంకాలను పూర్తిగా తొలగిస్తుంది లేదా గణనీయంగా తగ్గిస్తుంది. ఇందుకు అనుగుణంగా భారత్ ఎగుమతులపై విధించే సుంకాలను అమెరికా (2025 ఏప్రిల్ 2న విధించిన 25 శాతం నుంచి) 18 శాతానికి తగ్గిస్తుంది. జౌళి ఉత్పత్తులు, వస్త్రోత్పత్తులు, చర్మ ఉత్పత్తులు, పాదరక్షలు, ప్లాస్టిక్స్, రబ్బర్, సేంద్రియ రసాయనాలు, గృహాలంకరణ సామగ్రి, చేతి వృత్తుల ఉత్పత్తులు, నిర్దిష్ట యంత్రాలు మొదలైన భారతీయ సరుకులపై అమెరికా సుంకాలు 18 శాతానికి తగ్గనున్నాయి. మధ్యంతర ఒప్పందాన్ని విజయవంతంగా అమలుపరచిన తరువాత జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, ముత్యాలు, వజ్రాలు, విమానాల విడిభాగాలు మొదలైన వాటిపై సుంకాలను అమెరికా తొలగిస్తుంది. భారత్ సుంకాలు పూర్తిగా తొలగించవలసి ఉండగా అమెరికా 18 శాతం సుంకాలు విధిస్తుంది ఇందులో సుంకాలు పరస్పర ప్రయోజనకరంగా ఉండేందుకు దోహదం చేసేది ఏమైనా ఉన్నదా?! అమెరికా వైద్య పరికరాల వాణిజ్యంలోను, అమెరికా ఐసీటీ సరుకుల విషయంలో పరిమితులతో కూడిన లైసెన్సింగ్ విధానం రద్దు చేసేందుకు సుదీర్ఘకాలంగా ఉన్న అవరోధాలను తొలగించేందుకు భారత్ అంగీకరించింది. అమెరికా ఆహార, వ్యవసాయోత్పత్తుల ఎగుమతులపై సుంకాలేతర అవరోధాలను తొలగించేందుకు కూడా భారత్ అంగీకరించింది. అయితే ఇందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవల్సిన బాధ్యత అమెరికాకు లేదు. సుంకాలేతర అవరోధాలను తొలగించడం భారత్ తప్పనిసరి బాధ్యత కాగా అటువంటి బాధ్యత అమెరికాకు లేదు! ఇది ఎలా పరస్పర ప్రయోజనానికి తోడ్పడుతుంది?; రాబోయే అయిదు సంవత్సరాలలో భారత్ 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ కోల్ (ఉక్కు తయారీలో ఉపయోగించే బొగ్గు)ను కొనుగోలు చేస్తుంది. గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు, డేటా సెంటర్స్‌లో ఉపయోగించే ఇతర ఉపకరణాలు మొదలైన టెక్నాలజీ ఉత్పత్తుల వాణిజ్యాన్ని ఉభయ దేశాలు గణనీయంగా పెంపొందించుకున్నాయి. ప్రస్తావిత సరుకులు అన్నీ అమెరికా ఎగుమతులేకానీ, అమెరికా కొనదలుచుకున్న భారత్ ఉత్పత్తులు కావు. ఇటువంటి ఏకపక్ష వాణిజ్యం పరస్పర లబ్ధినిస్తుందా? సంయుక్త ప్రకటనతో పాటు జారీ చేసిన ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భారత్ చేపట్టనున్న 'ప్రధాన చర్యల' గురించి అమెరికా అధ్యక్షుడు ప్రస్తావించారు. రష్యా నుంచి చమురు ప్రత్యక్ష, పరోక్ష కొనుగోళ్లను నిలిపివేసేందుకు, అమెరికా ఇంధన ఉత్పత్తుల కొనుగోళ్లకు, అమెరికాతో మధ్యంతర ఒప్పంద చట్రాన్ని రక్షణ రంగంలో సహకారానికి కూడా విస్తరింపజేసేందుకు భారత్ కట్టుబడి ఉన్నది. ఈ కారణంగా 2025 ఆగస్టు 6న భారత్ తనపై విధించిన 25శాతం అదనపు సుంకాన్ని ఉపసంహరించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు నిర్ణయం తీసుకున్నారు. మూడు కీలక అంశాలలో భారత్ నుంచి హామీ పొంది, అందుకు ప్రత్యుపకారంగా అమెరికా ఎటువంటి సానుకూల నిర్ణయాలు తీసుకోపోవడం పరస్పర ప్రయోజనకర సూత్రానికి అనుగుణంగా ఉన్నదా? రష్యా నుంచి చమురు ప్రత్యక్ష లేదా పరోక్ష కొనుగోలును భారత్ పునఃప్రారంభిస్తే భారతీయ సరుకులపై 25శాతం దండనాత్మక సుంకం విధింపుతో సహా అదనపు కఠిన చర్యలు చేపట్టే విషయాన్ని అమెరికా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది: ఇది బెదిరింపు కాదా? 2026 ఫిబ్రవరి 6న ఉభయదేశాలు అంగీకరించిన వాణిజ్య ఒప్పందం రష్యా చమురు అనే నిర్దిష్ట అంశంపై ఆధారపడి ఉన్నది. భారత్ ఎట్టి పరిస్థితులలోను రష్యా నుంచి చమురు కొనుగోలు

## మాయమవుతున్న జలనిధులు!



వాతావరణ మార్పుల వల్ల భూ ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. మరోవైపు భూగర్భ జలాలను అతిగా తోడేయడం, భూసార క్షీణత, అడవుల నరికివేత, కాలుష్యం వంటివి భూగోళాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ పరిణామాల వల్ల ప్రపంచం నీటి కొరత నుంచి 'జల వనరుల అదృశ్యం' దిశగా పయనిస్తోందని ఐక్యరాజ్య సమితి తాజాగా హెచ్చరించింది. ప్రపంచ నాయకులు ఇకనైనా ఈ వాస్తవాన్ని గ్రహించి, జల సంరక్షణకు పూనుకోవడం అత్యావశ్యకం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సహజ నీటి వనరులను తిరిగి భర్తీచేయలేనంత స్థాయిలో వినియోగిస్తున్నామనీ... పర్యవసానంగా నీటి వనరులు ఖాళీ అయిపోతూ జలపరమైన ఆస్తుల విషయంలో దివాలా తీస్తున్నామని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక ఉద్ఘాటించింది. దీన్ని ఐరాస విశ్వవిద్యాలయానికి చెందిన జల, పర్యావరణ, ఆరోగ్య సంస్థ (యూఎన్‌యూ- ఐఎన్‌డబ్ల్యూఈహెచ్) వెలువరించింది. అనేక ప్రాంతాలు తమకున్న జలవనరులకన్నా ఎక్కువగా నీటిని వాడేసుకుంటున్నాయనీ, దాంతో చాలా జలవనరులు ఇప్పటికే వట్టిపోవడమో, తరిగి పోవడమో జరుగుతోందనీ ఆ సంస్థ డైరెక్టర్ కావే మదానీ హెచ్చరించారు. నేడు 75శాతం ప్రపంచ జనాభా నీటి ఎద్దడిని ఎదుర్కొంటోందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

### సహజ నీటి వనరులకు ముప్పు

భూగోళంపై 70శాతం భూగర్భ జలాలు నెమ్మదిగా క్షీణిస్తున్నాయని ఐరాస నివేదిక విశ్లేషించింది. 400 కోట్ల మంది ఏడాదిలో కనీసం నెల రోజులపాటు నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. ప్రకృతి ఏటా మళ్లీ భర్తీ చేయగలిగినదానికన్నా ఎక్కువ మొత్తంలో నీటిని వాడేసుకుంటున్నాం. వర్షాల ద్వారా నదుల్లోకీ, భూగర్భంలోకీ, హిమపాతం వల్ల హిమానీనదాలలోకీ చేరే నీటికన్నా చాలా అధికంగా నీటిని వినియోగిస్తూ జలవనరులు ఖాళీ కావడానికి మనమే కారణమవుతున్నామని సమితి నివేదిక హెచ్చరించింది. జల నిధుల దివాలా వల్లనే చెరువులూ జలాశయాలూ అదృశ్యమవుతున్నాయి. హిమనదాలు కరిగి కుంచించుకుపోతున్నాయి. చిత్తడి నేలలు సైతం కనిపించకుండా పోతున్నాయి. భూగర్భ జలనిధులు తరిగిపోవడం వల్ల డెల్టా ప్రాంతాలు, నగరాలు నేలలోకి కుంగిపోతున్నాయి. ఏటా వర్షాల రూపంలో నదుల్లోకీ, భూగర్భంలోకీ చేరే నీటిని వార్షిక ఆదాయంగా; భూగర్భ జల నిధులను దీర్ఘకాలిక పొదుపుగా పరిగణిస్తే... రెంటినీ ఖాళీ చేసేస్తూ దివాలా తీసిపోతున్నామని ఐరాస నివేదిక విశ్లేషించింది. ప్రపంచంలోని సగం భారీ జలాశయాలలో 1990 దశకం నుంచీ నీటి నిల్వలు తరిగిపోతున్నాయి. ఇది పాతిక శాతం ప్రపంచ జనాభాకు నష్టదాయకమవుతోంది. గడచిన 50 ఏళ్లలో 41 కోట్ల హెక్టార్ల చిత్తడి నేలలు అదృశ్యమయ్యాయి. ఇది ఏకంగా ఐరోపా ఖండ విస్తీర్ణానికి సమానం! భూగోళంపై 70శాతం భూగర్భ జలనిధులు క్రమంగా తరిగిపోతున్నాయి. దీర్ఘకాలంలో అవి వట్టిపోయే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. భూగర్భ జలం 40శాతం సాగునీటికీ, 50శాతం తాగునీటికీ మూలాధారం. పలు దేశాల్లో 1970ల నుంచి హిమానీనదాల్లోని మంచు 30శాతానికి పైగా కరిగిపోయింది. విరివిగా ఆనకట్టలు నిర్మించడం వల్ల అనేక నదులు సముద్రంలో కలవలేకపోతున్నాయి. నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న దేశాల్లో మూడొంతుల ప్రపంచ జనాభా నివసిస్తుండగా, అందులో 220 కోట్ల మందికి సురక్షిత తాగునీరు లభించడం లేదు. 350 కోట్ల మందికి సరైన పారిశుద్ధ్య వసతులే లేవు. 42 కోట్ల ఎకరాల పంట భూములకు తీవ్ర సాగునీటి కొరత ఎదురవుతోంది. దాదాపు పాతిక కోట్ల ఎకరాల భూమి చవుడుదేరిపోయింది. భూగర్భ జలాలు క్షీణిస్తున్నందువల్ల చాలా దేశాల్లో నేల కుంగిపోతోంది. అటువంటి ప్రాంతాల్లో సుమారు రెండొందల కోట్ల మంది నివసిస్తున్నారు. కొన్ని నగరాలు ఏడాదికి 25 సెంటీమీటర్ల చొప్పున కుంగిపోతున్నాయి. 2022-23లో తీవ్ర అనావృష్టి వల్ల 180 కోట్లమంది 30,700 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొన్నారు. చిత్తడి నేలలు అదృశ్యమవడం వల్ల ప్రపంచానికి ఏటా 5.1 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లుతోంది. పశ్చిమాసియా, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో నీటి కొరత అంతకంతకూ పెరిగిపోతోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భూగర్భ జలవనరులను పూర్తిగా తోడేయడం వల్ల ఏర్పడిన తాగునీటి కొరత సామాజిక అలజడికి దారితీసింది. పొలాలకు సాగునీరు, నగరాలకు తాగునీరు లభించక జనం అల్లాడిపోతున్నారు.

### మన పరిస్థితీ అంతే!

దేశ రాజధాని దిల్లీ తాగునీటి కొరతతో సతమతమవుతోంది. ప్రపంచ జనాభాలో 18శాతం భారత్‌లోనే నివసిస్తున్నా, ప్రపంచ జలవనరుల్లో కేవలం నాలుగు శాతమే భారత్ సొంతం. 2030కల్లా ఇండియా తీవ్రస్థాయి నీటి కొరతను ఎదుర్కొంటుందని అంచనా. అప్పటికి 40శాతం భారతీయులకు సురక్షిత తాగునీటికి కరవు ఏర్పడుతుందని నీతి ఆయోగ్ హెచ్చరించింది. ప్రపంచంలో నీటి నిల్వలు తరిగిపోతున్న దేశాల్లో 300 కోట్ల మంది నివసిస్తున్నారు. ప్రపంచ ఆహారోత్పత్తిలో సగం ఈ ప్రాంతాల్లోనే జరుగుతోంది. వాతావరణ స్థిరత్వం, వర్షపాతం, నదీ మూలాలు, భూగర్భ జలనిధులు దెబ్బతింటే నీటి సరఫరాకు తీరని నష్టం తప్పదు. జల వనరుల రక్షణకు రాజకీయ, ఆర్థిక, సైద్ధాంతిక తేడాలను పక్కనపెట్టి అందరూ కలసికట్టుగా కృషిచేయాలి. జలవనరులను కాపాడుకుంటే- ఎడారుల విస్తరణనూ, వాతావరణ మార్పులనూ, జీవవైవిధ్య నష్టాన్నీ అరికట్టవచ్చు. నదుల ఎగువ ప్రాంతాలు, దిగువ ప్రాంతాలనే భేదం పాటించకుండా, అందరి జలభద్రతకూ నిధులు, సాంకేతికతలను వినియోగించాలి. అంతర్జాతీయ ఒప్పందాలతో సమైక్యంగా కృషి చేయాలి.

## చిన్న పరిశ్రమలకు చిక్కులు తప్పేదెప్పుడు?



కేంద్ర బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) రంగానికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించడం స్వాగతించదగ్గ అంశం. దేశ జీడీపీలో 30శాతం, పారిశ్రామికోత్పత్తిలో 35శాతం, ఎగుమతుల్లో 48శాతం వాటా కలిగిన ఈ రంగం 33 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది. కానీ, పెట్టుబడులు, మౌలిక వసతుల కొరత, అధిక ఉత్పత్తి వ్యయం వంటివి ఎంఎస్‌ఎంఈలను పట్టిపీడిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరిస్తే దేశార్థికానికి చిన్న పరిశ్రమలు మరింత బలిమి చేకూర్చగలుగుతాయి. దేశంలో వస్తూత్పత్తి, ఉపాధి కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్‌ఎంఈలు) కీలకంగా మారాయి. కానీ, దేశంలో 7కోట్లకు పైబడిన ఎంఎస్‌ఎంఈల్లో చాలామటుకు అరకొర లాభాలతోనే నెట్టుకొస్తున్నాయి. ఖాతాదారుల నుంచి బిల్లుల వసూలు ఆలస్యమవుతుండటంతో ఆర్థిక ఇక్కట్లు తప్పడంలేదు. ఎంఎస్‌ఎంఈలకు రూ.30 లక్షల కోట్ల రుణ కొరత ఉంది. పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు, కాలంచెల్లిన సాంకేతికత, పరిమిత మార్కెట్ ఈ సంస్థల వ్యాపారాన్ని బలహీనపరుస్తున్నాయి. విదేశాల్లోని ఎంఎస్‌ఎంఈలకు 3-5శాతం వడ్డీకే నిధులు లభిస్తుంటే, మన దగ్గర 11-14శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దాంతో మన పరిశ్రమల ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉంటోంది. పైగా అవి ఆధునిక సాంకేతికతలను సమకూర్చుకోక, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోలేక అంతర్జాతీయ విపణిలో పోటీపడలేకపోతున్నాయి.

### తడిసిమోపెడు... విద్యుత్, రవాణా ఛార్జీలు!


మన ఎంఎస్‌ఎంఈలను ఆదుకోవాలంటే వడ్డీపై సబ్సిడీ ఇవ్వడం, రుణ గ్యారంటీ విస్తరణ, ప్రాధాన్య రంగానికి రుణ సరఫరాలో సంస్కరణలు తీసుకురావడం అత్యావశ్యకం. వడ్డీరేట్లు తగ్గించడంతోపాటు సకాలంలో రుణాలు అందించాలి. రుణ బకాయిల చెల్లింపునకు 45 రోజుల గడువు ఇవ్వాలి. జీఎస్టీ, డిజిటల్ లావాదేవీల సమాచారాలను ఉపయోగించి వ్యాపారంలో ప్రస్తుత, భవిష్యత్తు నగదు ప్రవాహాన్ని అంచనా వేసి రుణాలివ్వాలి. తద్వారా ఎంఎస్‌ఎంఈల చేతిలో డబ్బు ఆడేట్లు చూడాలి. క్లస్టర్ ఆధారిత రుణ సరఫరా ద్వారా ఎంఎస్‌ఎంఈల ఉత్పత్తి సామర్థ్యాన్నీ, పోటీతత్వాన్నీ పెంచవచ్చు. ప్రస్తుతం ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లకు కేంద్రం, రాష్ట్రాలు 80:20 నిష్పత్తిలో రుణాలిస్తున్నాయి. కానీ చాలా రాష్ట్రాలు తమ వాటా నిధులను సమకూర్చడంలేదు. కాబట్టి, కేంద్రమే డిజిటల్ పద్ధతుల్లో, సకాలంలో వంద శాతం రుణాలిచ్చి వాటిని ఆదుకోవాలి. మన దేశంలో ఎంఎస్‌ఎంఈలకు యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.8-9 వరకు ఉంటోంది. ఇతర దేశాలు ఇంతకన్నా చాలా తక్కువ ధరలకే కరెంటు అందిస్తున్నాయి. భారతీయ ఎంఎస్‌ఎంఈల ఉత్పత్తి వ్యయంలో 15-30 శాతం విద్యుత్ ఛార్జీలకే ఖర్చయిపోతోంది. కాబట్టి, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలి. మన ఎంఎస్‌ఎంఈలకు కొత్త టెక్నాలజీలను సబ్సిడీ ధరలకు అందించి, ఉమ్మడి వసతులను విస్తరిస్తే- ఉత్పత్తి పరిమాణం, నాణ్యతలో 15శాతం వరకు వృద్ధి సాధించవచ్చు. మరిన్ని సంస్థలు ఎగుమతి మార్కెట్‌లో ప్రవేశించేలా ప్రత్యేక రాయితీలూ సౌకర్యాలూ అవసరం. ప్రభుత్వ ఆర్డర్లలో 25శాతాన్ని ఎంఎస్‌ఎంఈలకు కేటాయిస్తున్నప్పటికీ... కఠినమైన టెండర్ నిబంధనలు, అధిక టర్నోవర్ ఉండాలనడం, చెల్లింపుల్లో జాప్యం వీటిని వెనక్కి లాగుతున్నాయి. స్వీయ ధ్రువీకరణ, డిజిటల్ తనిఖీల ద్వారా ఈ అడ్డంకులను తొలగించాలి. సంపన్న దేశాల్లో ఎంఎస్‌ఎంఈలకు రవాణా ఖర్చులు 8-10శాతమే అవుతుంటే, మన దగ్గర 13-14శాతం వరకు వెచ్చించాల్సి వస్తోంది. కాబట్టి వాటికి రవాణా సబ్సిడీలు, ఉమ్మడి గిడ్డంగులు, మెరుగైన అనుసంధానత కల్పించాలి. చిన్న పరిశ్రమలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రీఫండ్‌లను వీలైనంత త్వరగా అందించడంతో పాటు జీఎస్టీ రిటర్న్‌లను సరళీకృతం చేసి, చట్టపరమైన నిబంధనల విషయంలో వెసులుబాటు కల్పించడం చాలా అవసరం.

### ధరల స్థిరీకరణ... బీమా రక్షణ

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ముడిసరకుల కోసం కొద్ది మొత్తాల్లో ఆర్డరు పెట్టడం వల్ల బేరమాడే సత్తా ఉండదు. దాంతో ధరల్లో వచ్చే తేడాలు వాటి ఉత్పత్తి, మార్కెటింగ్ ప్రణాళికలను దెబ్బతీస్తాయి. ఉక్కు, రసాయనాలు, ప్లాస్టిక్‌ల తయారీలో నిమగ్నమైన ఎంఎస్‌ఎంఈలకు ఇది చాలా పెద్ద సమస్య. సరసమైన ధరలకే వాటిని అందించేలా ముడి పదార్థాల నిధులను ఏర్పాటు చేయాలి. ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాలు, వరదలు వంటి విపత్తులు, సైబర్ దాడులు, సరఫరా గొలుసుల విచ్ఛిన్నం నుంచి ఎంఎస్‌ఎంఈలను ఆదుకోవడానికి రుణ అనుసంధానిత బీమా సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, ప్రీమియం చెల్లింపులో సబ్సిడీ కూడా ఇవ్వాలి. తొలితరం ఎంఎస్‌ఎంఈ వ్యవస్థాపకులకూ, మహిళా వ్యవస్థాపకులకూ ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. కర్బన ఉద్గారాలను పరిహరించే హరిత సాంకేతికతలను అందించి, వ్యర్థాల శుద్ధికి తోడ్పడాలి. ఇంధనాన్నీ విద్యుత్తునూ పొదుపుగా వాడుకునే యంత్రాలను సమకూర్చాలి. తద్వారా మన ఎంఎస్‌ఎంఈలను నవీన యుగానికి సంసిద్ధం చేయాలి.

## ఇరాన్ లో అధికార మార్పు జరిగితే ఉత్తమం- ఈ సమస్యను శాశ్వతంగా ముగిస్తా

ఇరాన్ లో సైనిక చర్యపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు- అధికార మార్పు జరగాలని వెల్లడి




ఇరాన్‌పై సైనిక చర్యకు సంబంధించిన ఆలోచనలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అధికార మార్పు జరిగితే అది ఉత్తమ పరిణామం అవుతుందని అన్నారు. ట్రంప్ ప్రభుత్వం మధ్యప్రాచ్యానికి రెండో విమాన వాహక నౌకను పంపిస్తున్నట్లు ప్రకటించిన కొద్ది గటంలకే ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇరాన్‌లో అధికార మార్పు జరిగితే అదే ఉత్తమం. 47 ఏళ్లుగా వారు మాట్లాడుతూనే ఉన్నారు. చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే అపార శక్తి అక్కడికి చేరుకుంది. మరిన్ని బలగాలు కూడా వెళ్తున్నాయి. దీనిని ఒకేసారి పూర్తిగా ముగిస్తే మంచిదే. ఇరాన్‌పై తన ప్రధాన లక్ష్యం అణు కార్యక్రమాన్ని నియంత్రించడమే అయినప్పటికీ, అది మాత్రమే కాకుండా ఇతర అంశాలు కూడా కీలకం. చర్చలు విజయవంతం అవుతాయని అనుకుంటున్నా. విఫలమైతే అది ఇరాన్‌కు చాలా చెడు రోజు అవుతుంది' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ తన అణు కార్యక్రమంపై తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఒత్తిడి పెంచుతూ, ట్రంప్ ప్రభుత్వం మధ్యప్రాచ్యానికి రెండో విమాన వాహక నౌకను పంపాలని నిర్ణయించింది. ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధనౌకగా పేరుగాంచిన యూఎస్ ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ ప్రస్తుతం కరేబియన్ సముద్రం నుంచి పశ్చిమాసియా దిశగా బయలుదేరుతోంది. గతంలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించిన ఆపరేషన్‌లో కూడా యూఎస్ ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ కీలక పాత్ర పోషించింది. ఇప్పటికే మధ్య ప్రాచ్యంలో ఉన్న యూఎస్ ఎస్ అబ్రహం లింకన్ నౌకతో పాటు, ఇప్పుడు 'ఫోర్డ్' కూడా చేరనుంది. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే, యుద్ధనౌక యూఎస్ ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ అవసరం అవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

### ప్రాంతీయ ఉద్రిక్తతలపై ఆందోళన

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం తర్వాత ఇప్పటికే అస్థిరంగా ఉన్న మధ్యప్రాచ్యంలో, ఈ పరిణామం మరో ప్రాంతీయ యుద్ధానికి దారితీయవచ్చని గల్ఫ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గత వారం ఒమన్, ఖతార్ దేశాల మధ్యవర్తిత్వంతో ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని అమెరికా భావించినప్పటికీ, అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో సైనిక ఒత్తిడిని పెంచాలని భావిస్తోంది. ఇదే సమయంలో దేశవ్యాప్త నిరసనలపై ఇరాన్ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యల వల్ల అంతర్గత ఒత్తిడి పెరుగుతోంది. మృతుల కోసం 40వ రోజు సంతాప కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుటుంబాలు ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను మరింత పెంచుతున్నాయి.

### దీర్ఘకాల నౌకా మోహరింపు - సిబ్బందిపై ప్రభావం

ఎస్ ఫోర్డ్ ఇప్పటికే ఎనిమిది నెలలుగా సముద్రంలోనే ఉందని అమెరికా నేవీ టాఫ్ అధికారి అడ్మిరల్ డారిల్ కాడిల్ తెలిపారు. సాధారణంగా యుద్ధ నౌకలు ఆరు లేదా ఏడు నెలలు మాత్రమే మోహరించబడతాయని చెప్పారు. అయితే వాటి పొడిగింపు సిబ్బంది జీవితాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. కుటుంబ కార్యక్రమాలు, వివాహాలు, పిల్లల జననాలు కూడా దెబ్బతింటాయని పేర్కొన్నారు. దీంతో నౌక మరమ్మతులు, నిర్వహణ షెడ్యూల్ కూడా దెబ్బతినే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.

### ఇరాన్ వాదన ఏంటి?

2015లో కుదిరిన అణు ఒప్పందం నుంచి 2018లో అమెరికా తప్పుకోవడంతో పరిస్థితులు మరింత క్లిష్టమయ్యాయి. అప్పటి నుంచి ఇరాన్ అధిక స్థాయిలో యురేనియం సమృద్ధి చేయడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఆంక్షల కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఆంక్షల ఎత్తివేతను చర్చల్లో కీలక అంశంగా టెహ్రాన్ భావిస్తోంది. మరోవైపు ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత ప్రయోజనాల కోసమేనని చెబుతోంది. అయితే గతంలో 60 శాతం వరకు యురేనియం శుద్ధి చేయడం అంతర్జాతీయ ఆందోళనకు కారణమైంది.

# పాక్‌తో మ్యాచ్- ఈసారైనా షేక్‌హ్యాండ్ ఇస్తారా- కాంట్రవర్సీపై సల్మాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్!



వరల్డ్‌కప్‌లో మరికొన్ని గంటల్లోనే భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభం కానుంది. కొలంబో వేదికగా ఫిబ్రవరి 15న ఈ మ్యాచ్ ఉండనుంది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ఈసారి, అనేక వివాదాల నడుమ ఈ దాయాదుల పోరు ఖరారైంది. అయితే ఇప్పుడు మరో సస్పెన్స్ తెరపైకి వచ్చింది. అది మరేంటో కాదు, షేక్ హ్యాండ్ కాంట్రవర్సీనే. ఈ మ్యాచ్‌లో 'పాకిస్థాన్ ప్లేయర్లతో మనోళ్లు షేక్‌హ్యాండ్ ఇస్తారా?' అనే ఉత్కంఠ కొనసాగుతోంది. దీనిపై తాజాగా పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా మాట్లాడాడు. మరి ఆతను ఏమన్నాడంటే ఆదివారం మ్యాచ్ సందర్భంగా పాక్ కెప్టెన్ సల్మాన్ తాజాగా ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. ఇందులో అతడు 'షెక్‌హ్యాండ్ వివాదం'పై కీలక కామెంట్స్ చేశాడు. రేపటి మ్యాచ్ లో టాస్ సమయంలో లేదా ఆట ముగిసిన తర్వాత 'భారత్ ప్లేయర్లతో కరచాలనం చేస్తారా' అనే విషయంపై సస్పెన్స్‌ను కొనసాగించాడు. కానీ, క్రీడా స్ఫూర్తితో మాత్రమే ఆటను ఆడాలని తెలిపాడు.

'అది డిసైడ్ చేసుకోవాల్సింది వాళ్లే'

షేక్‌హ్యాండ్ వివాదంపై మీడియా ప్రశ్న అడగ్గా, అది నిర్ణయించుకోవాల్సింది టీమ్‌ఇండియానే అని, అయినా 'దాని గురించి రేపు చూద్దాం' అంటూ సల్మాన్ అఘా సింపుల్ గా సమాధానం చెప్పాడు. 'క్రికెట్‌లో కచ్చితంగా క్రీడాస్ఫూర్తి ఉండాలి. దీనిపై నా వ్యక్తిగత అభిప్రాయం పట్టించుకోకపోయినా ఫర్వాలేదు. కానీ కికెట్ ఎల్లప్పుడూ క్రీడా స్ఫూర్తితోనే ఆడాలి. వాళ్లు షేక్ హ్యాండ్ ఇస్తే మేము చేయి కలుపుతాం. మరి దీనిపై ఏం చేయాలో నిర్ణయించుకోవాల్సిందే వాళ్లే' అని అఘా అన్నాడు. అయితే సల్మాన్ సమాధానంతో దీనిపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. గతేడాది పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా టీమ్‌ఇండియా ప్లేయర్లు, దుబాయ్ వేదికగా జరిగిన 2025 ఆసియాకప్ మ్యాచ్‌లో పాక్ ఆటగాళ్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు. ఆ టోర్నీలో పాక్‌తో మూడుసార్లు మ్యాచ్ (ఫైనల్ సహా) ఆడినప్పటికీ భారత్ మాత్రం ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లతో కరచాలనం చేయలేదు. ఇది ఇప్పటికీ క్రీడావర్గాల్లో హాట్ టాపిక్‌గా ఉంది. అయితే రేపటి మ్యాచ్ లోనైనా దాయాది దేశం ఆటగాళ్లతో భారత్ ప్లేయర్లు చేతులు కలుపుతారా? అనేది ఉత్కంఠగా ఉంది.

ట్రాక్ రికార్డ్ పై ఏమన్నాడంటే

వరల్డ్ కప్ టోర్నమెంట్ ల్లో పాకిస్థాన్ పై భారత్ దే పైచేయిగా ఉంది. దీనిపైనా సల్మాన్ మాట్లాడాడు. 'భారత్ పై ఉన్న గత చరిత్రను మేం మార్చలేం. కానీ ప్రతిసారి లాగే ఈసారి కూడా మెరుగ్గా అడేందుకు ప్రయత్నిస్తాం. టీమ్ లో ప్రతీ ఆటగాడు కీలకమే. అయితే తారిఖ్ బౌలింగ్ యాక్షన్ పై ట్రోల్స్ ను పట్టించుకోం. అతడికి ఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాబర్ ఫామ్ పై మాకు ఆందోళన లేదు. భారత జట్టులో కూడా అభిషేక్ ఉండాలనే ఆశిస్తున్నాం. ప్రత్యర్థి జట్టు కూడా అత్యుత్తమంగా ఉండాలనే కోరుకుంటాం. ఇక ఎవరు అత్యుత్తమంగా ఆడతారో వాళ్లే గెలుస్తారు. అంతేకానీ మ్యాచ్ లో టాస్ అనేది కీలకం కాదు' అని పేర్కొన్నాడు. కాగా, టీ20 ప్రపంచకప్ లో ఇప్పటిదాకా ఇండోపాక్ మధ్య తొమ్మిది మ్యాచ్ లు జరగ్గా, అందులో అత్యధికంగా భారత్ ఏడింట్లో నెగ్గింది. 2021 టోర్నీలో ఓడింది. ఇంకో మ్యాచ్ టైగా ముగిసింది. ఇక రేపటి మ్యాచ్ లోనూ టీమ్‌ఇండియా నెగ్గి ఈ రికార్డును 8-1కు పెంచుకోవాలని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ఆశించాడు.

ఇరుజట్లు జోరుమీదే!

ఈ టోర్నీలో భారత్, పాక్ రెండు జట్లు కూడా వరుస విజయాలతో జోరుమీదున్నాయి. ఈ ఇరుజట్లు గ్రూప్ స్టేజ్ లో ఇప్పటిదాకా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గాయి. ఈ క్రమంలో పట్టికలో టాప్ ప్లేస్ కోసం రేపటి మ్యాచ్ కీలకం కానుంది.

# వీభారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు వర్షం ముప్పు- వెదర్ రిపోర్ట్ ఇదే!

## భారత్ పాక్ మ్యాచ్- కొలంబోలో వాతావరణ శాఖ ఊహించని హెచ్చరికలు జారీ- మ్యాచ్ సమయంలో వర్షం కురిసే అవకాశం!



క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత క్రేజీ ఫైట్ అంటే అది భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే మ్యాచే. ఈ రెండు జట్లు తలపడుతున్నాయంటే చాలు మైదానంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతుంది. ఈ హై వోల్టేజ్ పోరు జరుగుతుంటే కోట్లాది మంది అభిమానులు టీవీలకు అతుక్కుపోతారు. అలాంటి పోరుకు మరోసారి రంగం సిద్ధమైంది. టీ20 వరల్డ్‌కప్‌లో అమీతుమీ తేల్చుకునేందుకు భారత్- పాక్ రెడీ అయ్యాయి. అయితే ఇప్పుడు ఈ మెగా ఫైట్‌కు ఊహించని అతిథి అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది. కొలంబో వేదికగా జరగాల్సిన ఈ మ్యాచ్ కు వాతావరణం నుంచి ముప్పు పొంచి ఉందని వార్తలు వస్తున్నాయి. అసలే ఎన్నో వివాదాల మధ్య ఈ మ్యాచ్ ఖరారైతే, ఇప్పుడు ప్రకృతి కూడా దీనికి అడ్డుపడేలా కనిపిస్తోంది. అసలు స్టేడియం దగ్గర పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

కొలంబోలో వర్షం గండం

ఫిబ్రవరి 15 ఆదివారం కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో భారత్, పాక్ జట్లు తలపడాల్సి ఉంది. సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే ఈ కీలక మ్యాచ్ కు భారీ వర్షం ముప్పు పొంచి ఉందని శ్రీలంక వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మ్యాచ్ జరిగే సమయంలో నిరంతరాయంగా వర్షం కురిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం అక్కడి ఖెత్తరామ ఏరియాలో 70 శాతం వర్షం పడే ఛాన్స్ ఉందని రిపోర్ట్స్ చెబుతున్నాయి. దీంతో ఈ మ్యాచ్ సజావుగా సాగుతుందా లేదా అనే అనుమానాలు అభిమానుల్లో మొదలయ్యాయి.

ఫ్యాన్స్‌కు కొంత ఊరటనిచ్చే అంశం!

వర్షం ముప్పు ఉన్నప్పటికీ కొలంబో స్టేడియం దగ్గర ఒక మంచి సదుపాయం ఉంది. ఇదొక్కటే ఫ్యాన్స్‌కు కొంత ఊరటనిచ్చే ఒకే ఒక్క విషయం. ప్రేమదాస స్టేడియంలో గ్రౌండ్ మొత్తాన్ని కవర్లతో కప్పి ఉంచే సౌకర్యం అందుబాటులో ఉంది. ఒకవేళ వర్షం పడి ఆగితే, కేవలం 20 నిమిషాల్లోనే మళ్లీ ఆటను ప్రారంభించే అవకాశం ఉంటుందని గ్రౌండ్ సిబ్బంది ధీమాగా ఉన్నారు. అక్యూవెదర్ రిపోర్ట్ ప్రకారం సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుందని, 13 శాతం వర్షం పడే ఛాన్స్ ఉందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. వర్షం అంతరాయం కలిగించినా ఓవర్లు తగ్గించి అయినా మ్యాచ్ నిర్వహించాలని ఐసీసీ భావిస్తోంది. మ్యాచ్ రద్దయితే క్రికెట్ ఫ్యాన్స్ భారత్ పాక్ మ్యాచ్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. వాతావరణం అనుకూలించి మ్యాచ్ ఫుల్గా జరిగితే క్రికెట్ ఫ్యాన్స్ కి పండగే. ఒకవేళ వర్షం వల్ల మ్యాచ్ రద్దయితే ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయిస్తారు. అదే జరిగితే పాకిస్థాన్ కంటే టీమ్‌ఇండియాకే ఎక్కువ లాభం కలిగే అవకాశం ఉంది. ఎందుకంటే రన్ రేట్ పరంగా పాక్ కంటే భారత్ బలంగా ఉంది. ఇటీవల కాలంలో పాక్ తో ఆడిన ప్రతీసారి భారత్ తన ఆధిపత్యాన్ని చూపిస్తూ వస్తోంది. చివరగా ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ లో ఓడించింది. ఇక రేపటి మ్యాచ్ లో ఎలాంటి వాతావరణం చోటుచేసుకుంటుందో చూడాలి.

మొదట ఆడబోమని చెప్పి

ఈ మ్యాచ్ నిర్వహణ వెనుక పెద్ద కథే నడిచింది. భారత్ తో ఆడబోమని పాకిస్థాన్ గతంలో బాయ్ కాట్ స్టేట్ మెంట్ ఇచ్చినా, చివరకు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఐసీసీ, బంగ్లాదేశ్, శ్రీలంక బోర్డులు జరిపిన చర్చల తర్వాతే పాక్ జట్టు భారత్ తో ఆడేందుకు అంగీకరించింది. కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే ఈ మ్యాచ్ కోసం మొత్తం దక్షిణాసియా దేశాలు ఒక్కటయ్యాయి. ఐపీఎల్ లో ముస్తాఫిజుర్ రెహమాన్ రిలీజ్ విషయంలో మొదలైన గొడవ చివరకు ఒక సంధికి దారితీసి ఈ మ్యాచ్ జరగడానికి మార్గం సుగమమైంది.

టీమ్‌ఇండియా జోరు- నెక్ట్స్ టార్గెట్ పాక్

గ్రూప్ ఏలో టీమ్‌ఇండియా ఇప్పటికే దూసుకుపోతోంది. ఫిబ్రవరి 7న అమెరికాపై 29 పరుగుల తేడాతో గెలిచిన భారత్, ఫిబ్రవరి 12న నమీబియాపై 93 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు 4 పాయింట్లతో టేబుల్ లో టాప్ ప్లేస్ లో ఉన్న భారత్ కు పాక్ తో జరిగే మ్యాచ్ చాలా కీలకం. ఈ మ్యాచ్ లో కూడా గెలిచి సూపర్ 8 బెర్త్ ను పక్కా చేసుకోవాలని సూర్య సేన ప్లాన్ చేస్తోంది. ముఖ్యంగా ఫిట్ గా ఉన్న అభిషేక్ శర్మ టీమ్ లోకి రావడం భారత్ కు పెద్ద బలం అని చెప్పవచ్చు.

# భారత్ ను ఊరిస్తున్న 'వరల్డ్‌కప్ సెంటిమెంట్'- మళ్లీ టీమ్‌ఇండియానే వరల్డ్‌కప్ ఛాంపియనా





క్రికెట్ ప్రపంచంలో సెంటిమెంట్లు అనేవి ఒక్కోసారి ఊహించని విధంగా నిజమవుతుంటాయి. ముఖ్యంగా వరల్డ్ కప్ లాంటి మెగా టోర్నీలు జరుగుతున్నప్పుడు కొన్ని వింతైన పోలికలు భలే ఆసక్తిని కలిగిస్తాయి. ఇప్పుడు జరుగుతున్న 2026 టీ20 వరల్డ్ కప్‌లో కూడా సరిగ్గా అలాంటి సీనే ఒకటి కనిపిస్తోంది. ఒక చిన్న జట్టు ఏకంగా వరల్డ్ ఛాంపియన్లనే మట్టికరిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే ఈ ఓటమి ఆస్ట్రేలియాకు తగిలిన షాక్ మాత్రమే కాదు, దీని వెనుక టీమ్‌ఇండియాకు కలిసొచ్చే ఒక చరిత్ర దాగి ఉంది. ఆ సెంటిమెంట్ ఏంటి? ఓ వర్గం భారత్ ఫ్యాన్స్ ఎందుకు అంతగా ఖుషీ అవుతున్నారో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

ఆసీస్‌కు భారీ షాక్

కొలంబో వేదికగా జరిగిన గ్రూప్ బి మ్యాచ్‌లో జింబాబ్వే జట్టు అద్భుతమే చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 169 పరుగుల స్కోరు సాధించింది. అనంతరం 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాను జింబాబ్వే బౌలర్లు ముప్పుతిప్పలు పెట్టారు. బ్లెస్సింగ్ ముజార్బాని 4 వికెట్లతో చెలరేగి ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బ కొట్టాడు. దీంతో ఆస్ట్రేలియా 19.3 ఓవర్లలోనే 146 పరుగులకే ఆలౌటై , 23 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. ఈ గెలుపుతో టీమ్‌ఇండియా ఫ్యాన్స్‌లో కొత్త జోష్ నింపింది.

జింబాబ్వే షాక్ ఇవ్వడం మొదటిసారి కాదు

వరల్డ్ కప్ వేదికలపై ఆస్ట్రేలియాను జింబాబ్వే ఓడించడం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలోనూ పలుమార్లు ఈ పసికూన జట్టు కంగారూలకు షాక్ ఇచ్చింది. 1983 వన్డే వరల్డ్ కప్‌లో ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 13 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ఆ తర్వాత 2007 టీ20 వరల్డ్ కప్‌లో కేప్‌టౌన్ వేదికగా 5 వికెట్ల తేడాతో మరోసారి విజయం సాధించింది. ఇక 2014, 2022 వన్డే ఫార్మాట్లలో కూడా ఆసీస్‌పై జింబాబ్వే విజయాలు నమోదు చేసింది. ఇప్పుడు 2026 టీ20 వరల్డ్ కప్‌లో కొలంబో మైదానంలో 23 పరుగుల తేడాతో గెలిచి తన రికార్డును మరింత మెరుగుపరుచుకుంది.

1983 మ్యాజిక్- ఆసీస్ ఓటమి- భారత్ విక్టరీ

జింబాబ్వే ఆస్ట్రేలియాను ఓడించినప్పుడల్లా భారత్‌కు అదృష్టం వరిస్తుందనే సెంటిమెంట్‌కు 1983లో పునాది పడింది. ఆ ఏడాది జరిగిన వన్డే వరల్డ్ కప్‌లో జింబాబ్వే జట్టు ఆస్ట్రేలియాను ఓడించి పెను సంచలనం సృష్టించింది. ఇక్కడ వింత ఏంటంటే, అదే టోర్నీలో అప్పటివరకు పెద్దగా అంచనాలు లేని కపిల్ దేవ్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా అద్భుతంగా ఆడి ఫైనల్ చేరింది. అక్కడ బలమైన వెస్టిండీస్ జట్టును ఓడించి మొదటిసారి ప్రపంచ కప్‌ను ముద్దాడింది. ఆస్ట్రేలియా ఓటమి భారత్ విజయానికి నాంది పలకడం అప్పట్లో అందరినీ ఆశ్చర్యపరిచింది.

2007లో రిపీట్ అయిన సీన్

సరిగ్గా ఇలాంటి సెంటిమెంట్ 2007లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌లోనూ జరిగింది. ఆ టోర్నీలో కూడా జింబాబ్వే జట్టు ఆస్ట్రేలియాను ఓడించింది. అయితే ఈ టోర్నీలోనూ భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. 2007 ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించి ఎంఎస్ ధోనీ సారథ్యంలో భారత్ టీ20 ఫార్మాట్‌లో మొదటి విశ్వవిజేతగా నిలిచింది. అలా మరోసారి జింబాబ్వే గెలుపు, ఆస్ట్రేలియా ఓటమి సెంటిమెంటుకు మరికొంత బలాన్ని ఇచ్చింది.

2026లో హ్యాట్రిక్ కొట్టేనా

ఇప్పుడు 2026లో మళ్లీ అదే సీన్ రిపీట్ అవ్వడంతో ఫ్యాన్స్ హ్యాట్రిక్ ఖాయమని ఫిక్స్ అయిపోతున్నారు. ప్రస్తుతం టీమ్‌ఇండియా ఎంతో పటిష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే గ్రూప్ స్టేజ్‌లో ఆడిన రెండు మ్యాచుల్లోనూ అమెరికా, నమీబియాలపై ఘనవిజయాలు సాధించి అగ్రస్థానంలో కొనసాగుతోంది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు అద్భుతంగా రాణిస్తోంది. ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ఈ సెంటిమెంట్ భారత్‌కు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. మరి చరిత్ర పునరావృతమై భారత్ మూడోసారి టీ20 కప్పు కొడుతుందో లేదో చూడాలి.

## గతాన్ని మార్చలేము.. కానీ రేపు కొత్త ఆరంభమే..

# పాక్ క్రికెటర్ సల్మాన్ అఘా ఆసక్తికర వ్యాఖ్యలు!

భారత్‌తో రేపు జరగబోయే హై-వోల్టేజ్ టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌కు ముందు సల్మాన్ అలీ అఘా స్పందించారు. టీమిండియాపై తమకున్న పేలవమైన రికార్డును ఒప్పుకుంటూనే, అభిషేక్ శర్మ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.




సిరీస్ ఏదైనా సరే భారత్, పాకిస్తాన్ మ్యాచుకు ఉండే ఆ క్రేజ్ మామూలుగా ఉండదు. అలాంటి టీ20 ప్రపంచకప్ ఇరు జట్లు పోటీ పడుతున్నాయంటే.. ప్రపంచంలో ఏ మూలన మ్యాచ్ జరిగినా టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతాయి. అలాంటి మ్యాచ్ పై మొన్నవరకు నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. పాకిస్తాన్ జట్టు భారత్ మ్యాచ్ ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రేపు (ఫిబ్రవరి 15)న జరగబోయే భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ మెగా పోరుకు ముందు పాకిస్తాన్ క్రికెటర్ సల్మాన్ అలీ అఘా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రపంచకప్ వేదికలపై భారత్‌తో తలపడిన ప్రతిసారి పాకిస్థాన్ ఓటమి పాలవుతున్న చరిత్రను ఆయన గుర్తు చేసుకున్నారు. "భారత్‌పై మాకు మంచి రికార్డు లేదన్నది వాస్తవం. కానీ గడిచిపోయిన చరిత్రను మనం మార్చలేం. అయితే, ప్రతి రోజూ ఒక కొత్త ఆరంభమే (ఙఙవతీఎ ఝఎ అం ఖ అవష ఝఎ). రేపటి మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రాక్టీస్ సెషన్ తర్వాత మీడియాతో మాట్లాడిన సల్మాన్ అలీ అఘా.. టీమిండియా డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ పై ప్రశంసల జల్లు కురిపించారు. స్టమక్ ఇన్ఫెక్షన్ కారణంగా గత రెండు మ్యాచ్‌లకు దూరమైన అభిషేక్, పాక్‌తో మ్యాచ్ నాటికి కోలుకుంటారని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. "అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాడు. మేం ఎప్పుడూ అత్యుత్తమ జట్టు తో తలపడి మా సత్తా చాటాలని కోరుకుంటాం. ఆయన త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని సల్మాన్ తన క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు. ప్రస్తుతం అభిషేక్ శర్మ కొలంబో చేరుకుని నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొంటుండటంతో, రేపటి మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

## టీ20 వరల్డ్ కప్‌లో ఐర్లాండ్ విధ్వంసం..


# 'వరల్డ్ కప్' చరిత్రలో మరో రికార్డు స్కోరు




కొలంబో వేదికగా జరిగిన టీ20 ప్రపంచ కప్ మ్యాచులో ఐర్లాండ్ జట్టు విధ్వంసం సృష్టించింది. ఓమన్ తో జరిగిన ఈ మ్యాచులో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. దీంతో ఈ స్కోర్ టీ20 ప్రపంచ కప్ చరిత్రలో 2వ అత్యధిక స్కోరుగా రికార్డుల్లోకి ఎక్కింది. టీ20 వరల్డ్ కప్‌లో ఐర్లాండ్ జట్టు విధ్వంసం సృష్టించింది. గ్రూప్ స్టేజ్ లో భాగంగా శనివారం ఉదయం ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ బ్యాటర్లు రెచ్చిపోయారు. శ్రీలంకలోని కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచులో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఐర్లాండ్ కెప్టెన్ లోర్కాన్ టక్కర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించారు. కేవలం 51 బంతుల్లోనే 10 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. ఒకానొక దశలో వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో ఉన్న జట్టును టక్కర్ తన అద్భుత బ్యాటింగ్‌తో ఆదుకోవడమే కాకుండా, ప్రత్యర్థి జట్టు ముందు భారీ లక్ష్యాన్ని ఉంచారు. ఈ మ్యాచ్ ప్రారంభంలో ఐర్లాండ్ బ్యాటర్లు తడబడినప్పటికీ, టక్కర్‌కు తోడుగా గారెత్ డెలానీ (56) మెరుపు అర్ధసెంచరీతో రాణించారు. దీంతో వీరిద్దరూ కలిసి ఐదో వికెట్‌కు వేగంగా పరుగులు జోడించడంతో ఐర్లాండ్ పటిష్ట స్థితికి చేరుకుంది. ఆఖరి ఓవర్లలో జార్జ్ డాక్రెల్ (35 నాటౌట్) కేవలం 9 బంతుల్లోనే 5 సిక్సర్లతో విరుచుకుపడటంతో ఐర్లాండ్ స్కోరు 230 దాటింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఐర్లాండ్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. కాగా మొత్తం టీ20 ప్రపంచ కప్ చరిత్రలోనే ఇదే రెండవ అత్యధిక స్కోరుగా రికార్డుల్లో నిలిచింది. 260 పరుగులతో శ్రీలంక మొదటి స్థానంలో కొనసాగుతోంది. ఈ మ్యాచులో ఒమన్ జట్టు విజయం సాధించాలంటే నిర్ణీత 20 ఓవర్లలో 236 పరుగులు చేయాల్సి ఉంది.

# టెన్త్ పరీక్షలు రాయనున్న వైభవ్ సూర్యవంశీ

14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ క్రికెట్ కు గ్యాప్ ఇవ్వనున్నాడు. ఈ నెల17వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు వైభవ్ సూర్యవంశీ.




భారత కుర్ర క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అతి తక్కువ కాలంలోనే సచిన్ టెండూల్కర్ లాగా పాపులారిటీ దక్కించుకున్నాడు వైభవ్ సూర్యవంశీ. ప్రస్తుతం అండర్ 19 భారత జట్టులో కొనసాగుతున్న వైభవ్ సూర్యవంశీ, ఆటకు కొన్ని రోజుల పాటు బ్రేక్ ఇవ్వనున్నాడు. దీనికి ప్రత్యేక కారణం ఉంది. వైభవ్ సూర్యవంశీ ఇక పరీక్షలపై ప్రత్యేక ఫోకస్ చేయబోతున్నాడు. పదవ తరగతి పరీక్షలు రాసేందుకు ఈ డేంజర్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సిద్ధమయ్యాడు.

పదవ తరగతి పరీక్షలు రాయనున్న వైభవ్ సూర్యవంశీ

అండర్ 19 వన్డే వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ లో సంచలన ఆట తీరును ప్రదర్శించాడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. అలాంటి డేంజర్ ఆటగాడు వైభవ్ సూర్య వంశీ, ఈనెల 17వ తేదీ నుంచి జరిగే సీబీఎస్సీ పదవ తరగతి పరీక్షలు రాయబోతున్నాడు. ఈ మేరకు అతనికి అడ్మిట్ కార్డు కూడా అందించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ నీల్ కిషోర్ సిన్హా ఈ విషయాన్ని బహిర్గతం చేశారు. పరీక్షా హాలు లో సాధారణ విద్యార్థి మాదిరి లాగానే వైభవ్ సూర్యవంశీని ట్రీట్ చేస్తామని... అతనికి స్పెషల్ గా ఎలాంటి సదుపాయాలు ఉండబోవని వెల్లడించారు. ఇది ఇలా ఉండగా... 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నమెంట్ ద్వారా పాపులర్ అయ్యాడు. ఐపీఎల్ టోర్నమెంటులో రాజస్థాన్ రాయల్స్ జట్టు తరఫున బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఓపెనర్ గా అవకాశం వచ్చిన నేపథ్యంలో గత సీజనల్ లో అద్భుతంగా రాణించాడు. దానికి తగ్గట్టుగానే భారత జట్టులో కూడా ఎవరు ఊహించని రీతిలో ఆడుతున్నాడు వైభవ్ సూర్యవంశీ. ఏజ్ తక్కువ ఉంది కానీ, అతని సూర్య కుమార్ యాదవ్ సేనలోకి తీసుకురావాలని చాలామంది డిమాండ్ చేస్తున్నారు.

## ఓదెల మండలం గుంపుల వద్ద రోడ్డు ప్రమాదం...

ఇద్దరికి తీవ్ర గాయాలు..



ఓదెల//ఫిబ్రవరి 14 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పరిధిలోని గుంపుల ప్రాంతంలోని ఆర్‌ఆర్‌ఆర్ వైన్స్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం, వేగంగా వెళ్తున్న వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురికావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో గాయపడిన వారిలో ఒకరు బాయమ్మపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, మరొకరు ఇందుర్తి గ్రామానికి చెందినవారని సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. స్థానికులు ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు భద్రతా చర్యలు పెంచాలని అధికారులను కోరుతున్నారు.

## రోగ నిరోధక టీకాల కార్యక్రమంపై ప్రత్యేక పర్యవేక్షణ...

నమోదు ఖచ్చితత్వమే లక్ష్యం...



నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 14 ఆకాంక్ష : నాగర్‌కర్నూల్ జిల్లాలో రోగ నిరోధక టీకాల కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావాలనే లక్ష్యంతో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. సురేష్ బాబు శనివారం విస్తృత పర్యవేక్షణ చేపట్టారు. ఈ క్రమంలో పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ సెషన్‌ను స్వయంగా సందర్శించి, టీకాల ప్రక్రియపై సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీకా లబ్ధిదారుల వివరాలు, ఖౌ×చీ పోర్టల్‌లో ఆన్‌లైన్ నమోదు, టీకా నమోదు ఖచ్చితత్వం వంటి అంశాలను సూక్ష్మంగా పరిశీలించారు. చిన్నారులకు టీకాలు వేయించేందుకు వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లల ఆరోగ్య రక్షణకు సమయానికి అన్ని టీకాలు వేయించడం అత్యంత అవసరమని అవగాహన కల్పించారు. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ప్రతి అర్హులైన పిల్లవాడికి డ్యూ లిస్ట్ ప్రకారం టీకాలు అందేలా చూడాలని, ఈ విషయంలో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రికార్డు నిర్వహణ పారదర్శకంగా ఉండాలని, ఖౌ×చీ పోర్టల్‌లో నమోదులు తప్పులేమీ లేకుండా ఖచ్చితంగా చేయాలని డా. సురేష్ బాబు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో టీకాలపై అవగాహన పెంచుతూ, ప్రతి ఇంటికి చేరేలా ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని బలోపేతం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీల ద్వారా జిల్లాలో టీకాల కార్యక్రమం పటిష్టంగా కొనసాగుతోందని, సమగ్ర పర్యవేక్షణతో మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన తెలిపారు. అనంతరం తెలకపల్లి మరియు తాడూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని కోల్డ్ చైన్ పాయింట్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ నిర్వహిస్తున్న రోగ నిరోధక టీకాల కార్యక్రమంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. వ్యాక్సిన్ నిల్వల రికార్డులు, డ్యూ లిస్ట్‌లు, స్టాక్ రిజిస్టర్లు, వఎ×చీ ఆన్‌లైన్ నమోదు వివరాలను పరిశీలించి, టీకాల నిల్వలు మరియు వినియోగంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. కోల్డ్ చైన్ నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా టీకాల నాణ్యతను కాపాడే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని, టీకా నిల్వలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డా. సురేష్ బాబు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సిబ్బంది చురుకైన పాత్రతో టీకాల కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని, ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా శాతం వందకు చేరువలో టీకా కవరేజ్ సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, ఏపీఓ ఎన్‌డీవీ చారి, వీసీసీఎమ్ దివ్య, ఫార్మసీ అధికారులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో టీకాల కార్యక్రమం సమర్థంగా కొనసాగుతోందని, సమగ్ర పర్యవేక్షణతో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

## ఓం నగర్ కాలనీలో ఘనంగా

# జాతీయ మహిళా దినోత్సవం...

సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా 100 మంది మహిళలకు సన్మానం...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 14(ఆకాంక్ష) : భారత తొలి మహిళా గవర్నర్ అయిన సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సేవా భావం కలిగి సమాజానికి విశేష సేవలందిస్తున్న వందమంది మహిళలను గుర్తించి ఓం నగర్ కాలనీలో ప్రత్యేకంగా సన్మానించడం కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మహిళా శక్తి, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర, సేవా కార్యక్రమాల ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రసంగాలు చేశారు. సరోజినీ నాయుడు వంటి మహనీయుల ఆలోచనలు, ధైర్యసాహసాలు ప్రతి మహిళకు ఆదర్శంగా నిలుస్తాయని, సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్, జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రమోహన్ రెడ్డి, స్టేట్ లీడర్ వాస లక్ష్మి రాఘవేందర్, మాజీ అధ్యక్షుడు ఎన్. దత్తాత్రేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి రమణ జ్యోతి, క్లాస్మేట్ ఉపాధ్యక్షులు సంబు శ్రీను, అపర్ణన, జిల్లా మాజీ అధ్యక్షురాలు ఎం. భాగ్యమ్మ ముఖ్య అతిథులుగా హాజరై మహిళలను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు రేవతి, వరలక్ష్మి, వజ్రమ్మ, సునీత, రజని, రాగ దీప్తి తదితరులు మాట్లాడుతూ సమాజ సేవలో ముందుండే మహిళలకు ఇలాంటి సన్మానాలు ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు. మహిళల సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మీ పిల్లలు సరిగా నిద్ర పోవట్లేదా - కారణాలు ఇవే కావొచ్చట!

### చక్కటి నిద్ర కోసం ఈ టిప్స్ ట్రై చేస్తే బెటర్ అంటున్న నిపుణులు



చిన్నారులకు మంచి పోషకాహారం ఇవ్వటమే కాదు, కంటి నిండా నిద్ర పోయేలా చూసుకోవటమూ ముఖ్యమే. అయితే, కొంతమంది పిల్లలు ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. మరికొందరైతే ఓ పట్టాన నిద్రపోరు. పేరెంట్స్ విశ్వ ప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. చిన్నారులు ఇలా నిద్ర పోకుండా మెలకువతో ఉండడానికి అనేక కారణాలుంటాయని నిపుణులు చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

పగటి నిద్ర ఎక్కువగా :

ఐదేళ్ల వచ్చే వరకు చాలా మంది పిల్లలు పగలు భోజనం చేసిన తర్వాత నిద్ర పోతారు. దీంతో రాత్రి సరిగ్గా నిద్రపోరని చీఖ్ఆశీఋశ్రీ రాఆఎతీఋతీఎ శీట వీవంఆఏఆఅవ అధ్యయనం పేర్కొంది. కాబట్టి, పగటిపూట కొద్ది సేపే పడుకునేలా చేస్తే.. రాత్రుళ్లు వాళ్లు హాయిగా నిద్ర పోయే అవకాశం ఉందని అంటున్నారు.

గురక పెట్టడం :

చాలామంది పిల్లలు సీజనల్ అలర్జీ, జలుబు వంటి రకరకాల ఆరోగ్య సమస్యల వల్ల గురక పెడుతుంటారని నిపుణులు అంటున్నారు. ఈ గురక వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురై మధ్యమధ్యలో మేల్కొంటారని చెబుతున్నారు. కాబట్టి, పిల్లలు గురక పెట్టకుండా నిద్ర పోతున్నారంటే వాళ్లు ప్రశాంతంగా పడుకున్నారని అర్థం.

అనారోగ్యం :

పిల్లలు రాత్రిపూట సరిగా నిద్ర పోలేకపోవడానికి అనారోగ్యం కూడా కారణం కావచ్చంటున్నారు నిపుణులు. ఉదాహరణకు జలుబు చేసినప్పుడు శ్వాసకు సంబంధించిన సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి సమయాల్లో నిద్రాభంగం కలిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాగే, కొంత మంది పిల్లలు అలర్జీలు, ఆస్తమా వల్ల కూడా నిద్రలేమితో సతమతమవుతారని పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి ఆరోగ్యం ఎలా ఉందో పరిశీలించి, అవసరమైతే డాక్టర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు.

గ్యాడ్జెట్లకు దూరంగా :

ఈ తరం పిల్లలు మొబైల్స్, టీవీలు, వీడియో గేమ్స్, కంప్యూటర్లులతో ఎక్కువగా చెలిమి చేస్తారు. కాబట్టి, పడుకునే సమయంలో పిల్లల రూంలో ఇలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు లేకుండా జాగ్రత్త పడాలంటున్నారు నిపుణులు. లేదంటే రాత్రంతా కూర్చుని టీవీ చూడటమో, గేమ్స్ ఆడడమో చేస్తుంటారట. ఫలితంగా, పిల్లలు సరిగా నిద్రపోరని తెలియజేస్తున్నారు. విద్యార్థులు అల్పాహారం దాటవేయడం, టీ తాగడం, ఇంటర్నెట్ వ్యసనం వైపు ఎక్కువ ధోరణి , సామాజిక మద్దతు లేకపోవడం, ఒత్తిడి, నిద్రవేళకు ముందు మొబైల్ వాడకంతో పేలవమైన నిద్ర నాణ్యత గణనీయంగా ముడిపడి ఉందని ఎఏఆ- వఅఏవఎఆతీవష్ అధ్యయనం పేర్కొంది.

టాన్సిల్స్ వల్ల :

కొంతమంది పిల్లలు టాన్సిల్స్ సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. వీళ్లకు ముక్కు ద్వారా శ్వాస తీసుకోవడానికి కష్టమవుతుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, నోటి ద్వారా శ్వాస తీసుకుంటుంటారని పేర్కొంటున్నారు. దీంతో మధ్యమధ్యలో మెలకువ వచ్చి సరిగ్గా నిద్ర పోరని తెలియజేస్తున్నారు.

క్రమరహిత నిద్ర వేళలు :

ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవాలి. లేదంటే శరీరంలోని 'బయోలాజికల్ క్లాక్' దెబ్బతింటుందంటున్నారు నిపుణులు. అందుకే రోజూ ఒకే సమయంలో నిద్రపోవడం అలవాటు చేయాలని ంశ్రీవవజూటశీబఅఝ్ఆశీఅ అధ్యయనం పేర్కొంది. ఇలా చేస్తే అసలు నిద్రలేమి సమస్యలు ఉండవట.

శారీరక అసౌకర్యం :

గదిలో వెలుతురు, శబ్దం లేదా ఉష్ణోగ్రత సరైన మోతాదులో ఉండాలి. లేకపోతే నిద్రకు భంగం కలుగుతుందంటున్నారు నిపుణులు. అందుకే, పిల్లలకు గది సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు

కెఫిన్ :

చాక్లెట్లు, కూల్ డ్రింక్స్ లేదా కెఫిన్ ఉన్న పదార్థాలు రాత్రిపూట ఇవ్వడం వల్ల పిల్లలు ఉత్సాహంగా మారి నిద్రపోకుండా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. అందుకే, సాయంత్రం వేళ వీటిని పిల్లలకు ఇవ్వకపోవడమే మంచిదట. కెఫిన్ కలిగిన పానీయాలు నిద్ర నాణ్యతను దెబ్బతీస్తాయని చీఖ్ఆశీఋశ్రీ రాఆఎతీఋతీఎ శీట వీవంఆఏఆఅవ అధ్యయనం పేర్కొంది.

భయం లేదా ఆందోళన :

చీకటి అంటే భయం, ఒంటరిగా పడుకోవడానికి ఇబ్బంది పడటం లేదా పీడకలలు రావడం వల్ల మెలకువగా ఉంటారట. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఈ గేమ్ ఆడినవాళ్లు ఆత్మహత్య చేసుకుంటారట! - మీ పిల్లల ఫోన్ చెక్ చేయండి

### - గజియాబాద్‌లో ముగ్గురి ఆత్మహత్యకు ఆన్‌లైన్ గేమ్ కారణమని అనుమానాలు! - పిల్లలు ఏం ఆడుతున్నారో చెక్ చేయాలంటున్న నిపుణులు



ఉత్తర ప్రదేశ్‌లోని గజియాబాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు బిల్డింగ్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆన్‌లైన్ గేమ్ కు బానిసగా మారి, ఈ దారుణానికి ఒడిగట్టారని తేలడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో చాలా తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు అన్ని ఇళ్లలోనూ పిల్లలు ఫోన్ లో గేమ్స్ ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలు ఎలాంటి ఆటలు ఆడుతున్నారో చెక్ చేయాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రెండున్నరేళ్లుగా!

గజియాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు రెండున్నర సంవత్సరాలుగా ఆన్ లైన్ గేమ్స్ ఆడుతున్నట్టు వారి తండ్రి మీడియాకు తెలిపారు. ఈ గ్యాప్‌లో క్రమంగా కుటుంబానికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఫోన్ పట్టుకొని తమ రూమ్‌లోనే ఉండేవారట! ఈ ముగ్గురిలో ఒకరు ఇన్‌స్ట్రక్టర్‌గా ఉండేవారని, మిగిలిన ఇద్దరు ఆదేశాలు పాటించేవారని, వారి ఫోన్ లో ఉండే గేమ్ ఆఖరి టాస్క్ "సూసైడ్" అని ఉందని పోలీసు అధికారులు చెప్పినట్టు తండ్రి తెలిపారు.

"కొరియన్ బ్లూవేల్"!

కొరియాకు చెందిన ఓ యాప్ ద్వారా ఈ గేమ్ ఆడినట్టు సమాచారం. ఈ గేమ్‌తో ముగ్గురు అమ్మాయిలు సూసైడ్ చేసుకున్నట్టు తేలడంతో రష్యాకు చెందిన బ్లూవేల్ గేమ్ మరోసారి చర్చలోకి వచ్చింది. 2015లో రష్యాకు టీనేజర్ సూసైడ్ చేసుకోవడంతో బ్లూ వేల్ గేమ్ గురించి ప్రపంచానికి తెలిసింది. రెండేళ్ల క్రితం అమెరికాలో ఓ భారతీయ విద్యార్థి చనిపోయాడు. అతను బ్లూ వేల్ గేమ్ ఆడటం వల్లనే మరణించి ఉంటాడని అక్కడి అధికారులు అనుమానించారు.

గేమ్ ఎలా ఉంటుంది

బ్లూ వేల్ గేమ్ దాదాపు 50 రోజులు కొనసాగుతుంది. దీన్ని ఆడేవారు ఒక సీక్రెట్ ఆన్‌లైన్ గ్రూప్‌లోకి ఎంటర్ అవుతారు. దీన్ని రన్ చేసే వారు ప్లేయర్లకు రోజూ ఒక టాస్క్ ఇస్తారట. అర్ధరాత్రి నిద్ర లేవడం, భయపెట్టే దృశ్యాలు చూపించడం వంటివి చేస్తారట. ఈ టాస్కులు రోజు రోజుకూ తీవ్రత పెరుగుతూ వస్తాయట. రోజూ టాస్క్ కంప్లీట్ చేసిన అనంతరం ఫొటో లేదా వీడియో తీసి ప్రూఫ్ పంపించాలట. ఈ గేమ్ రన్ చేసే మాస్టర్ ఆటగాళ్లను మోటివేట్ చేస్తూ తన కంట్రోల్ లోకి తెచ్చుకుంటాడట. అలా రోజు రోజుకూ డేంజర్ టాస్కులు పెంచుతూ, 50వ రోజు ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపిస్తాడట.

ఎందుకు ఆపేయలేరు

"గేమ్ మధ్యలో ఆపేయొచ్చు కదా" అని మనకు అనిపిస్తుంది. కానీ, అదొక మాయా వలయంగా తయారవుతుందట. మొదట్లో గేమ్ ప్రమాదకరంగా అనిపించదు. ఆడేవాళ్లు దాన్నొక ఛాలెంజ్ గా తీసుకుంటారు. సగం రోజులు గడిచే దాకా అది తీవ్రమైన గేమ్ అనే విషయం అర్థం కాదట! ఇది తెలిసిన తర్వాత కూడా బయటకు రాలేరని మానసిక నిపుణులు చెబుతున్నారు. దాని తాలూకు ఆలోచనలు ఆపలేక మళ్లీ ఆట కొనసాగిస్తారట. ఒకవేళ ఎవరైనా బయటకు రావాలని ప్రయత్నిస్తే గేమ్ మాస్టర్ బెదిరిస్తాడట. ఫోన్ నెంబర్ మొదలు, పర్సనల్ సమాచారం ముందే సేకరిస్తారు కాబట్టి, కుటుంబ సభ్యులకు హాని చేస్తామని బెదిరిస్తాడట. దాంతోపాటు కొన్ని రోజుల్లో గేమ్ అయిపోతుంది. పూర్తి చెయ్ అంటూ మోటివేట్ చేస్తాడట!

కొరియన్ గేమ్ కూడా!

గజియాబాద్ లో ఆత్మహత్య చేసుకున్న పిల్లలు కూడా బ్లూవేల్ లాంటి ఆటనే ఆడి ఉంటారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా ఎంత మంది ఇలాంటి గేమ్స్ ఆడుతున్నారో తెలియదు. అందుకే తల్లిదండ్రులు తప్పకుండా పిల్లల ఆన్ లైన్ గేమ్స్ పై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెడుతున్నారనేది కూడా చూడాలని, వారి వ్యవహార శైలిని కూడా అబ్జర్వ్ చేయాలని చెబుతున్నారు. వాళ్లు ముభావంగా ఉండడం, నిత్యం బాధలో ఉండటం వంటివి చేస్తుంటే ప్రేమగా మాట్లాడి విషయం తెలుసుకోవాలని సూచిస్తున్నారు. పిల్లలతో సమయం గడపడం ద్వారా ఇలాంటి ప్రమాదాల్లో చిక్కుకోకుండా కాపాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# భారత్‌లో హెలికాప్టర్ల తయారీ- అదానీ, లియోనార్డో మధ్య కీలక ఒప్పందం

### అదానీ గ్రూప్, ఇటాలియన్ కంపెనీ లియోనార్డో మధ్య కీలక ఒప్పందం- భారత్ లో హెలికాప్టర్ల తయారీ కేంద్రం ఏర్పాటుకు సన్నద్ధం!



భారత్‌లో సమీకృత హెలికాప్టర్ తయారీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అదానీ గ్రూప్, ఇటలీకి చెందిన ప్రముఖ రక్షణ రంగ సంస్థ లియోనార్డో కీలక ఒప్పందం చేసుకున్నట్లు మంగళవారం ప్రకటించాయి. మేక్ ఇండియా ప్రయత్నాలకు, దేశాన్ని మరింత స్వయంసమృద్ధిగా మార్చడానికి ఇది గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా దేశ సైనిక అవసరాలకు అనుగుణంగా హెలికాప్టర్ల ఉత్పత్తిలో భారత్ స్వావలంబన పెంచడానికి ఇది ఉపయోగపడనుంది. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, లియోనార్డో సంస్థలు మంగళవారం దిల్లీలో ఈ అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేశాయి. భారత సాయుధ దళాల అవసరాలు తీర్చడమే కాకుండా, హెలికాప్టర్ల ఉత్పత్తిలో భారత్‌ను స్వయంసమృద్ధ దేశంగా మార్చడమే ఈ ఒప్పందం లక్ష్యంగా తెలుస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం, "ఈ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం వల్ల లియోనార్డోకు చెందిన అత్యాధునిక ూఔ169వీ, ూఔ109 ఞతీవనిఎవతీవీ హెలికాప్టర్లు భారత్‌లో తయారు చేస్తారు. దీని వల్ల భారత సైనిక అవసరాలకు అంతర్జాతీయ స్థాయి సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. అయితే ఇది కేవలం తయారీకే పరిమితం కాకుండా, దశల వారీగా స్వదేశీకరణ (ఇండియనైజేషన్), పటిష్టమైన నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాలింగ్ సామర్థ్యాలతో పాటు, పైలట్లకు సమగ్ర శిక్షణను కూడా అందిస్తుంది."

ఏటా 100 హెలికాప్టర్లు తయారీ!

భారత జనాభాతో పోల్చితే హెలికాప్టర్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. (జనాభా నిష్పత్తి ప్రకారం 250 కంటే తక్కువ హెలికాప్టర్లు ఉన్నాయి.) ఈ లోటును తీర్చేందుకు రానున్న 10 ఏళ్లలో ఏటా సుమారు 100 హెలికాప్టర్లు అవసరం ఉంటుందని అంచనా. అందుకే "దేశ పౌర, రక్షణ అవసరాలు తీర్చే సమీకృత హెలికాప్టర్ తయారీ వ్యవస్థకు పునాది వేస్తున్నాం. తయారీ, అసెంబ్లింగ్, శిక్షణను ఒకే చోటకు చేర్చి, అంతర్జాతీయ స్థాయి మద్దతును భారత్ గడ్డపై ఇస్తాం" అని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ తెలిపారు. "రానున్న దశాబ్దంలో భారత సైన్యానికి 1000 కంటే ఎక్కువ హెలికాప్టర్లు అవసరం అవుతాయి. కనుక అదానీ, లియోనార్డో ఒప్పందం దేశీయ తయారీ కలను సాకారం చేస్తుంది.""భారత్ ఒక పెద్ద మార్కెట్, ఇక్కడి సైనిక దళాల అవసరాలు తీర్చడానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని లియోనార్డో హెలికాప్టర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జియాన్ పియరో కుటిల్లో చెప్పారు. గత వారం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, బ్రెజిల్ దిగ్గజం ఎంబ్రేయర్ (ఋఎఎతీఋవతీ)తో కలిసి ప్రాంతీయ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటుకు కీలక ఒప్పందం చేసుకుంది. తాజాగా లియోనార్డోతో హెలికాప్టర్ల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇది ఈ రంగంలో అదానీ సంస్థల దూకుడును సూచిస్తోంది. భారత్ నమ్మకమైన భాగస్వామిభారత్ లోని ఇటలీ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలి ఈ ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. రక్షణ రంగంలని ఇద్దరు గ్లోబల్ ఛాంపియన్లు నేడు కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారని ఆయన కొనియాడారు. "రక్షణ రంగంలో భారత్ ఇటలీకి ఒక నమ్మకమైన, దీర్ఘకాలిక భాగస్వామి. హెలికాప్టర్ విభంగాలో లియోనార్డో అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉంది. మేము ఇటలీలో మరిన్ని భారత పెట్టుబడులను ఆశిస్తున్నాం. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీఏ) కేవలం వాణిజ్యం గురించి మాత్రమే కాదు. ఇది మన ఉమ్మది విలువలు, భద్రతకు సంబంధించింది" అని అన్నారు. "అదానీ డిఫెన్స్, లియోనార్డో మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) అత్యంతకీలకమైనది. గత వారమే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో ఎఫ్ టీఏ జరిగింది. ఆ సమయంలో రక్షణ, భద్రతా భాగస్వామ్యంతో సహా 3 ఒప్పందాలు కుదిరాయి. ఆత్మ నిర్భర్ భారత్ విజన్‌తో, మేము దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడమే కాకుండా, దేశంలోనే పోటీతత్వ పారిశ్రామిక సామర్థ్యాన్ని నిర్మించాలని అనుకుంటున్నాం" అని రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ అన్నారు.

# తండ్రికి తగ్గ తనయుడు

**సిపిఐ కంచుకోట ఎల్బీనగర్లో మరోసారి ఎగిరిన ఎర్రజెండా**

**మాజీ మేయర్ పై 119 ఆధిక్యం తో ఘనవిజయం..**

**డివిజన్ ప్రజలకు రుణపడి ఉంటా...**





గోదావరిఖని టౌన్//ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** రామగుండం నోటిఫైడ్ ఏరియా నుండి మున్సిపాలిటీగా మారిన తర్వాత 1998లో జరిగిన మొదటి మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థిగా మార్కపురి తిరుపతి గెలుపొందడం జరిగింది. అనంతరం 19వ వార్డు అనేక రకాలుగా అభివృద్ధి చేయడంతో పాటు మున్సిపల్ లో ఉన్న అన్ని వార్డు సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారు ఆయన స్ఫూర్తితో 2009లో విద్యార్థి నాయకుడిగా ఏఐఎస్ఎఫ్ నుండి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన కుమారుడు మార్కపురి సూర్య అంచెలంచెలుగా కమ్యూనిస్టు పార్టీలో ఎదుగుతూ అనేక పదవులు అలంకరించడంతోపాటు అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొనడం అనేక కేసులను ఎదుర్కోవడం జరిగింది. 28 సంవత్సరాల తర్వాత మొన్న జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా మార్కపురి సూర్య పోటీ చేయడంతో పాటు ఆ స్థానం నుండి గెలిచి తండ్రికి తగ్గ తనయుడు గా పేరు తెచ్చుకున్నారు. కమ్యూనిస్టు భావజాలంతో అనేక ఉద్యమాల్లో పాల్గొన్న సూర్య రాబోయే రోజుల్లో



రామగుండం కార్పొరేషన్ ప్రజల గొంతుకగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడానికి ఎల్బీనగర్ ప్రజలు ఇచ్చిన విలక్షణ తీర్పు గొప్ప సూర్య మాట్లాడుతూ... ఎల్బీనగర్ ప్రజలు రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో ఒక గట్టి సమాధానాన్ని చెప్పారని వారి తీర్పు నాపై మరింత బాధ్యతను పెంచడంతోపాటు డివిజన్ అభివృద్ధి పట్ల నిబద్ధుడిని పనిచేసే విధంగా ప్రజలకు జీవితకాలం రుణపడి ఉంటానని అన్నారు.

## శనేశ్వర స్వామికి పాక్షిక శని త్రయోదశి తిలతైల అభిషేక పూజలు....



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** శ్రీ విశ్వవసు సంవత్సరం మాఘమాసం కృష్ణపక్ష ద్వాదశి సందర్భంగా వచ్చిన పాక్షిక శని త్రయోదశి శనివారం బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలోని శనేశ్వర స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో తిలతైల అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. శని గ్రహ దోష నివారణకు స్వామివారిని దర్శించుకున్న భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి తిలతైలాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామివారికి పాక్షిక శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేకంగా తిలతైల అభిషేకాలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ మాఘమాసంలో శనేశ్వర స్వామిని భక్తితో ఆరాధిస్తే విశేష ఫలితాలు లభిస్తాయని, జన్మ రీత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోషాలు నివారణకు ప్రతి ఒక్కరూ స్వామివారిని శక్తిమేరకు పూజించాలని సూచించారు.ఇదే సందర్భంలో ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించగా, నందీశ్వర స్వామికి ప్రత్యేక అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీరశేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు, భక్తులు మరియు మహిళలు పాల్గొన్నారు.

## కార్పోరేటర్ గెలుపు పట్ల రామాలయంలో ప్రత్యేక పూజలు...



గోదావరిఖని టౌన్//ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** రామగుండం 54వ డివిజన్ కార్పోరేటర్గా ముస్తఫా ఘన విజయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ 54వ డివిజన్‌కు చెందిన గుడెపు దేవేందర్ శనివారం కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముస్తఫా కార్పోరేటర్గా గెలిస్తే రామాలయంలో 51 కొబ్బరికాయలు కొడతానని దేవేందర్ మొక్కుకున్నారు.ప్రజల ఆశీర్వాదంతో ముస్తఫా ఘన విజయం సాధించడంతో, తన మొక్కును నెరవేర్చుతూ కోదండరామాలయంలో 51 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. 54వ డివిజన్ అభివృద్ధి కోసం ముస్తఫా మరింత కృషి చేసి ప్రజలకు సేవ చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.ముస్తఫా విజయాన్ని పురస్కరించుకుని స్థానికులు, అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంజా శ్రీనివాస్,ఎండీ.రజాక్,పీక అరుణ్ కుమార్,ఆడెపు రవి,బత్తుల భరత్,మట్ట శివ,ఓంకార్,వెంకన్న, శంకర్,పీక శివ,ప్రణయ్, పీక భరత్,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలు, చిన్నారులకు టీకాలు తప్పనిసరి...

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ బాబు..**



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రతి గర్భిణీ మరియు చిన్నారికి టీకాలు తప్పని సరిగా అందేలా చూడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ బాబు వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం నగర్ కర్నూల్ జిల్లాలోని తెల్కపల్లి, తాడూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మల్కాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ సెషన్‌ను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ టీకాల అమలు విధానాన్ని సమీక్షించారు.ఈసందర్భంగా టీకా రికార్డులు, డ్యూ లిస్ట్‌లను సవివరంగా పరిశీలించిన ఆయన కోల్డ్ చైన్ వ్యవస్థ సక్రమంగా కొనసాగుతోందో లేదో, వ్యాక్సిన్ నిల్వలు సరిపడా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. ఏ ఒక్క గర్భిణీ లేదా చిన్నారి టీకా మిస్ కాకుండా గుర్తించి తప్పనిసరిగా టీకాలు వేయాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రతి సెషన్‌ను ప్రామాణిక విధానాల ప్రకారం నిర్వహిస్తూ రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం పాటించాలని ఆయన స్పష్టం చేశారు.టీకాలపై అవగాహన పెంపొందిస్తూ, గ్రామ స్థాయిలో మిస్ అయిన లబ్ధిదారులను గుర్తించి వెంటనే టీకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో క్రమం తప్పకుండా టీకా కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీలలో జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, ఏపీఓ ఎన్డీవీ చారి, విసిసిఎమ్ దివ్య పాల్గొన్నారు.

# గడ్డిమందు విషపానం కేసుల్లో సమయానికి చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చు....

**మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్...**

పెద్దపల్లిటౌన్/ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** గడ్డిమందు (పారాకుట్) తాగిన వారిని 45 గంటల లోపే ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలను నిలబెట్టే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ వెల్లడించారు. పెద్దపల్లి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో ఎక్కువగా ఎండోసల్ఫాన్ మందు సేవించే ఘటనలు ఉండేవని, దానికి విరుగుడు ఉండడంతో బాధితులను సులభంగా కాపాడగలిగామని తెలిపారు. అయితే ఇటీవలి కాలంలో గడ్డిమందు సేవించే ఘటనలు పెరిగాయని, దీనికి ప్రత్యేక విరుగుడు లేకపోవడంతో మరణాల శాతం ఎక్కువగా ఉంటోందని పేర్కొన్నారు. అయినప్పటికీ సకాలంలో స్పందించి 45 గంటలలోపే బాధితులను ఆసుపత్రికి చేర్చితే, దశలవారీగా చికిత్స అందిస్తూ ప్రాణాలను కాపాడగలుగుతున్నామని వివరించారు.గత 56 సంవత్సరాల్లో గడ్డిమందు విషపానం కేసుల్లో చికిత్సలో గణనీయమైన




పురోగతి సాధించామని, ఒకప్పుడు 100 శాతం మరణాలు నమోదవుతున్న పరిస్థితి నుంచి ప్రస్తుతం సుమారు 25 శాతం వరకు రోగులను బ్రతికించగలుగుతున్నామని ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు మెడికవర్ ఆసుపత్రిలో గడ్డిమందు తాగిన 200 మంది రోగులకు చికిత్స అందించి, వారిలో 52 మందిని కాపాడినట్లు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక ఫిల్టర్ల సహాయంతో ఇది సాధ్యమవుతోందన్నారు.గడ్డిమందు తాగిన బాధితులను తరలించే సమయంలో ఆక్సిజన్ ఇవ్వకూడదని ఆయన హెచ్చరించారు. ఆక్సిజన్ వల్ల విషపదార్థం ఊపిరితిత్తుల్లోకి వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని చెప్పారు. అదేవిధంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాను "స్టోన్‌బెల్ట్"గా పేర్కొంటూన్నారు. ఈ ప్రాంతంలో కిడ్నీల్లో రాళ్ల సమస్య ఎక్కువగా కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ ఉన్నవారు ఈ సమస్యను పట్టించుకోకుండా నడుం నొప్పిగా భావించి పేయిన్‌కిల్లర్లు వాడడం వల్ల కిడ్నీలు దెబ్బతింటున్నాయని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కిడ్నీ సంబంధిత సమస్యలను నివారించవచ్చని సూచించారు.మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, బొంగోని హరీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ప్రజల తీర్పు...

**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్...**

గోదావరిఖని//ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ దుర్మార్గ పాలనకు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని రామగుండం మాజీ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శనివారం గోదావరిఖని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు చాలా తక్కువ ఓట్ల తేడాతోనే ఓటమి చెందారని, అయినప్పటికీ ప్రజలు అధికార పార్టీపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయని అన్నారు. రామగుండం రాజకీయ చరిత్రలో ఇంతటి ఒత్తిళ్లు, బెదిరింపులు, అధికార దుర్వినియోగం జరిగిన ఎన్నికలను ఎప్పుడూ చూడలేదని ఆయన విమర్శించారు. అభ్యర్థులు, నాయకులు,కార్యకర్తలను బెదిరించడం, ప్రజలను ప్రచారానికి



రాకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు.ఎన్ని ఇబ్బందులు సృష్టించినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి తమ అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేశారని కోరుకంటి చందర్ అన్నారు. ఓటమి పాలైన బీఆర్ఎస్ అభ్యర్థులు చేసిన పోరాటం అభినందనీయమని, ఇది నైతికంగా బీఆర్ఎస్ పార్టీ విజయం, ప్రజల విజయమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అరాచక పాలనకు వ్యతిరేకంగా తమ అభ్యర్థులు సాధించిన విజయాలు ప్రజల నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేసిన ఆయన, పార్టీ నాయకత్వం అందరికీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, పి టి. స్వామి, మురళీధర్ రావు, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య, మేకల శారద, ఆవుల శ్యామమణి, రమేష్, కర్క పద్మజ శ్రీనివాస్ రెడ్డి, తాళ్ళ చిన రాజయ్య, నాయకులు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, అచ్చే వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజు, గుర్రం పద్మ, జక్కుల తిరుపతి, చెలుకలపల్లి శ్రీనివాస్, కొలుగూరి సాయి, కిరణ్ జీ తదితరులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం కోసం పసి ప్రాణాల బలి...

**కన్నబిడ్డలనే విషమిచ్చి చంపిన తల్లి...**

**ఎలుకల మందు కలిపిన ఆహారం ఇచ్చి**

**కూతురు, కొడుకును హతమార్చిన ఘటన...**

**సోదరి, మరో వ్యక్తి సహకారంతో దారుణానికి**

**పాల్పడిన జస్సీ కౌర్**

పంజాబ్//ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** పంజాబ్ రాష్ట్రంలోని భఠిండా పరిధిలో మానవత్వాన్ని మసకబార్చే ఘోర సంఘటన వెలుగుచూసింది. తల్లిగా ఉండే మమకారాన్ని మరిచి, తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని భావించి, కన్నబిడ్డల్నే హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇద్దరు పసిప్రాణాలు మాయమైన ఈ దారుణ ఘటనతో ప్రాంతమంతా షాక్‌కు గురైంది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, జస్సీ కౌర్ అనే మహిళకు సుఖ్‌ప్రీత్ కౌర్ (8), ఫతేవీర్ (6) అనే ఇద్దరు చిన్నారులు ఉన్నారు. అయితే, జస్సీ కౌర్‌కు వేరొక వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిసింది. ఆ సంబంధానికి పిల్లలు అడ్డుగా ఉన్నారని భావించిన ఆమె, వారిని తొలగించుకోవాలని నిర్ణయించుకుంది.ముందుగా రెండు వారాల క్రితం తన కుమార్తె సుఖ్‌ప్రీత్ కౌర్‌కు ఆహారంలో ఎలుకల మందు కలిపి ఇచ్చింది. తన తల్లి ఇచ్చిన ఆహారాన్ని అనుమానం లేకుండా తిన్న చిన్నారి కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయింది. ఆ సమయంలో చిన్నారి మరణాన్ని సహజ మరణంగా చూపిస్తూ బంధువులను, స్థానికులను తప్పుదారి పట్టించింది.అయితే 15 రోజుల తర్వాత, మిగిలి ఉన్న తన





ఆరేళ్ల కొడుకు ఫతేవీర్‌కు కూడా అదే విధంగా ఎలుకల మందు కలిపిన ఆహారం తినిపించింది.ఈ ఘటన తర్వాత శనివారం బాలుడు కూడా మృతి చెందడంతో స్థానికులకు అనుమానం కలిగింది. వెంటనే పోలీసులు సమాచారం అందుకున్నారు. రెండు చిన్నారుల మరణాలు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు జస్సీ కౌర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. విచారణలో ఆమె తన నేరాన్ని ఒప్పుకుంది. వివాహేతర సంబంధం కోసం తన పిల్లలను ఎలుకల మందుతో హత్య చేసినట్లు అంగీకరించింది. ఈ ఘటనలో జస్సీ కౌర్‌కు సహకరించిన ఆమె సోదరి మోటో కౌర్, లాఖీ సింగ్ అనే వ్యక్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి సహకారంతోనే ఈ ఘోర నేరం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.ఈ ఘటన పంజాబ్‌లోనే కాక దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం, దిగ్భ్రాంతిని రేకెత్తిస్తోంది. తల్లి చేతుల్లోనే ఇద్దరు అమాయక చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం మానవత్వానికే మచ్చగా నిలిచిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# యూరియా కోసం రైతుల పడరాని పాట్లు...

**నారాయణగూడెం పీఏసీఎస్‌లో హ్యాకింగ్ కలకలం...**

నల్గొండ//ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** వండే ముందు అన్నం మనదే అనిపించి, తినే సమయానికి గిన్నె లాక్కుంటే ఎలా ఉంటుందో అచ్చంగా అలాంటి దుస్థితినే ఎదుర్కొంటున్నారు పెన్‌పహాడ్ మండలం నారాయణగూడెం పీఏసీఎస్ పరిధిలోని రైతులు. గతంలో వ్యవసాయానికి పెట్టుబడి సాయం నుంచి పంటలకు గిట్టుబాటు ధరల వరకు సాగును సంబురంగా మార్చిన పరిస్థితులు ఇప్పుడు కనిపించక పోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో యూరియా దొరికితే చాలు అదే పెద్ద సంబురంగా భావించాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ ఇప్పుడు అది కూడా రైతులకు అందకుండా పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.వానాకాలం, యాసంగి రెండు సీజన్లలోనూ ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పెన్‌పహాడ్ మండలం నారాయణగూడెం పీఏసీఎస్ పరిధిలోని అనంతారం సింగిల్ విండో కార్యాలయానికి శుక్రవారం సాయంత్రం 444 బస్తాల యూరియా దిగుమతి చేసి గోదాంలో నిల్వ చేశారు. అయితే శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో అధికారులు కంప్యూటర్‌లో ఎలాంటి స్టాక్ అప్‌లోడ్ చేయలేదు.కానీ శనివారం ఉదయం 7.25 గంటల సమయంలో పీఏసీఎస్ పరిధిలోని



సిస్టమ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేసి 444 బస్తాల యూరియాను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఈ విషయం తెలిసిన రైతులు పెద్ద ఎత్తున సింగిల్ విండో కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులను నిలదీశారు. పాస్‌వర్డ్ ఇతరులకు ఎలా తెలిసిందని వ్యవసాయ అధికారి అనిల్ నాయక్‌ను ప్రశ్నించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ యూరియా బస్తాలను షాప్ వద్దకు చేర్చడమే తమ బాధ్యత అని, కంప్యూటర్‌లో లాగిన్ చేయడం తమ పని కాదని తెలిపారు. ఈ ఘటనపై నారాయణగూడెం సింగిల్ విండో సహకార సంఘం వారు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.అదే సమయంలో యూరియా బుక్ చేసుకున్న రైతులు కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. గత వానాకాలంలో పడిన ఇబ్బందులకంటే ఈ యాసంగిలో మరింత రెట్టింపు కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎరువుల దుకాణాల వద్ద లైన్లో నిలబడకుండా ముందుగానే స్టాక్ వివరాలు తెలుసుకొని బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం ఇటీవల 'ఫర్టిలైజర్ మొబైల్ యాప్'ను ప్రవేశపెట్టింది. అయితే ఆ యాప్‌లో కూడా అవకతవకలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. యాప్‌లో 'నో స్టాక్' చూపించడం, బుక్ చేసుకున్న తర్వాత దుకాణాలకు వెళ్లినా సర్వర్ సమస్యలతో గంటల తరబడి వేచి ఉండాల్సి రావడం వల్ల వ్యవసాయ పనులు పక్కన పెట్టి రోజంతా ఫోన్ చేతిలో పట్టుకుని కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనతో నారాయణగూడెం పీఏసీఎస్ పరిధిలో యూరియా సరఫరాపై అనుమానాలు మరింతగా పెరిగాయి. రైతులకు సరైన సమయంలో ఎరువులు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రయాగ్‌రాజ్‌లో ప్రేమ విఫలం యువకుడి మృతి

లక్నో//ఫిబ్రవరి 14 **(ఆకాంక్ష) :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ నగరంలో ప్రేమ విఫలమై 17 ఏళ్ల యువకుడు మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రేమికుల దినోత్సవం రోజున చోటుచేసుకున్న ఈ ఘటనపై కుటుంబ సభ్యులు హత్య అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అమన్ గిరి (17) ఇంటర్ చదువుతూ, ఎన్డీఏ ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. అదే కోచింగ్ సెంటర్‌కు వచ్చే యువతితో అతడికి పరిచయం ఏర్పడి, గత ఎనిమిది నెలలుగా ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. అయితే ఇటీవల వారిద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో ఆ యువతి బ్రేకప్ చెప్పినట్లు సమాచారం. అంతేకాకుండా ఆమె మరో యువకుడితో సన్నిహితంగా ఉంటున్నట్లు అమన్‌కు తెలిసింది. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురైన అమన్ ప్రేమికుల దినోత్సవం రోజైన శనివారం తన గదిలో



ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. యువతితో బ్రేకప్ కారణంగానే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు రాసిన లేఖను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అయితే అమన్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రియురాలు, ఆమె స్నేహితుడు కలిసి అమన్‌ను బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి, అతడి తల్లి నగలు కాజేసిన తర్వాత హత్య చేసి ఆత్మహత్యలా మలిచారని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఘటనపై పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.

## ఎరువుల దుకాణాలపై దాడులు....

### అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు: ఏవో సారిక రావు హెచ్చరిక...



నిర్మల్// **ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాల్సిన బాధ్యత డీలర్లదేనని, అధిక ధరలకు అమ్మకాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ సహనం ఉండదని మండల వ్యవసాయ అధికారిణి సారిక రావు తీవ్రంగా హెచ్చరించారు. కుభీర్ మండల కేంద్రంలోని శ్రీరామ ట్రేడర్స్ ఫర్టిలైజర్ దుకాణాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవలే ఈ దుకాణ లైసెన్స్ రద్దుకు జిల్లా ఉన్నతాధికారులకు సిఫారసు చేసినప్పటికీ, దుకాణం తెరిచి ఉంచి రూ.266 ధర ఉన్న యూరియా బస్తాను రూ.360 నుంచి రూ.370 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలర్ తాము అమ్మకాలు చేయడం లేదని, రైతులు ముందుగా బుక్ చేసుకున్న యూరియా బస్తాలను మాత్రమే అందిస్తున్నామని వివరణ ఇచ్చినప్పటికీ, నియమావళి ఉల్లంఘన జరిగిందని పేర్కొంటూ వెంటనే దుకాణాన్ని మూసి వేయించారు. తదుపరి బస్టాండ్ సమీపంలోని మరిన్ని రెండు ఎరువుల దుకాణాలను కూడా ఆమె తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించిన మొత్తానికి ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లకు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వ్యవసాయ అధికారిణి సారిక రావుతో మాట్లాడుతూ ఫర్టిలైజర్ యాప్ వినియోగంలో పలు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. కొద్ది రోజుల్లో ఆ సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇచ్చిన ఆమె, ఎక్కడైనా అధిక ధరలకు యూరియా విక్రయిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.

## కాసిపేటలో రోడ్డు నిర్మాణం కోసం గ్రామస్థుల ఆందోళన...



మంచిర్యాల/**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలోని తూర్పు వాడలో గ్రామస్థులు శనివారం భారీగా నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోకి వెళ్లే ప్రధాన ఆర్అండ్బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయిందని ఆగ్రహంతో గ్రామస్థులు వాహనాలను అడ్డుకొని ఆందోళన చేపట్టారు. రోడ్డు మరమ్మతులు చేయాలని, శాశ్వతంగా పక్కా రహదారి నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామస్థుల వివరాల ప్రకారం సింగరేణి సంస్థకు చెందిన వాహనాలు, దేవాపూర్ సిమెంట్ కంపెనీ ట్రక్కులు మరియు ఇతర భారీ లోడుతో ఉన్న వాహనాలు మందమర్రిలోని టోల్ ప్లాజాను తప్పించుకునేందుకు కాసిపేట గ్రామం గుండా ప్రయాణిస్తున్నాయి. ఈ భారీ వాహనాల రాకపోకల వల్ల గ్రామంలోని ఆర్అండ్బీ రహదారి పూర్తిగా పాడైపోయిందని గ్రామస్థులు వాపోయారు. రోజుకు వందలాది వాహనాలు గ్రామంలోకి రావడంతో రోడ్డు మట్టిమయంగా మారి తీవ్రంగా దెబ్బతిన్నదని తెలిపారు. సింగరేణి సంస్థ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌లో లభించే మట్టిని రోడ్డుపై పోసి తాత్కాలికంగా సరిచేసినా, ఆ మట్టి మరింతగా ధ్వంసానికి దారి తీసిందని గ్రామస్థులు ఆరోపించారు. ఎండ కాలంలో ఆ మట్టి దుమ్ముగా మారి ఇళ్లలోకి చేరుతూ ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆందోళన కారులు మాట్లాడుతూ తక్షణమే ఆర్అండ్బీ అధికారులు, సింగరేణి యాజమాన్యం స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టోల్ ప్లాజాను తప్పించుకునే భారీ వాహనాలపై నియంత్రణ విధించాలని, గ్రామం గుండా వాహనాల రాకపోకలను పరిమితం చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని గ్రామస్థులు హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ రహదారి నిర్మాణం వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఘనంగా శ్రీవాణి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు...




సుల్తానాబాద్//**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** విద్యార్థులు చదువుతోపాటు క్రమ శిక్షణను అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీవాణి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అన్నారు. సుల్తానాబాద్ మండలం నర్సాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని విజయ గార్డెన్లో శనివారం శ్రీవాణి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి శశాంక మాట్లాడుతూ అంకితభావంతో విద్యను అభ్యసిస్తేనే విజయాలు సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ వేడుకల్లో కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసాని శ్రీనివాస్, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ బండారి కమలాకర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ పోటీలకు కొత్తగూడెం యువ క్రీడాకారుల ఎంపిక...



కొత్తగూడెం//**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెం పట్టణానికి చెందిన యువ రెజ్లింగ్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావడం జిల్లా క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచింది. త్రీ ఇంక్లైన్, ధన్బాద్ గ్రామ పంచాయతీ ప్రాంతాలకు చెందిన కే. లిఖిత్ చరణ్, వి. సాయి శృతి, వి. శరణ్య తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి జిల్లా కీర్తిని నిలబెట్టారు. ఇటీవల కొత్తగూడెంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. 48 కేజీల విభాగంలో కే. లిఖిత్ చరణ్, 62 కేజీల విభాగంలో వి. సాయి శృతి, 46 కేజీల విభాగంలో వి. శరణ్య స్వర్ణ పతకాలు సాధించి జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. ఈ విజయంతో రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనే అర్హత పొందారు. ఈ సందర్భంగా కొత్తగూడెం 2 టౌన్ సీఐ డి. ప్రతాప్ శనివారం క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో కూడా తమ ప్రతిభను చాటుతూ పతకాలు సాధించి జిల్లా కీర్తిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తాము ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. కాశీ హుస్సేన్, ఉపాధ్యక్షుడు ఐ. ఆదినారాయణ, జాతీయ రెజ్లింగ్ క్రీడాకారిణి పి. నిహారిక తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా వెల్దుర్తిలో విషాదం...


### బాలుడి ఊపిరి తీసిన ఊయల...



కర్నూల్//**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** కర్నూలు జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వెల్దుర్తి మండలం పరిధిలోని కలుగొట్ల గ్రామంలో చీరతో కట్టిన ఊయల ప్రాణాంతకంగా మారింది. మెడకు చుట్టుకుని ఊపిరాడక ఏడేళ్ల బాలుడు అఫ్రోజ్ మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అఫ్రోజ్ ఇంటి వద్ద ఆడుకుంటూ చీరతో కట్టిన ఊయలపై ఊగుతున్నాడు. ఈ క్రమంలో ఊయల కట్టిన చీర అతని మెడకు బిగుసుకొని ఊపిరాడకుండా చేసింది. బాలుడు అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు అతడిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈఘటనతో గ్రామంలో విషాద ఛాయలు కమ్ముకున్నాయి. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్తులు, తల్లిదండ్రులు పిల్లలతో జాగ్రత్తగా ఉండాలని, ఇంట్లో ఏర్పాటు చేసే ఊయలలు, తాడు, చీరలతో పిల్లలు ఆడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఢిల్లీ జిల్లాలో ప్రియుడితో గొడవ..

### బిల్డింగ్ పైనుంచి దూకిన యువతి...



న్యూఢిల్లీ//**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రేమజంట మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర కలకలం రేపింది. ప్రియుడితో కలిసి ఓ హోటల్‌కు వచ్చిన 22 ఏళ్ల యువతి, పెళ్లి విషయంలో జరిగిన వాగ్వాదంతో ఆవేశానికి లోనై నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యువతి తన ప్రియుడితో కలిసి నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో దిగింది. ఈ సమయంలో పెళ్లి విషయంపై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వాగ్వాదం క్రమంగా గొడవగా మారడంతో ఆగ్రహానికి గురైన యువతి ఒక్కసారిగా హోటల్ నాలుగో అంతస్తు బాల్కనీపైకి వెళ్లి కిందకు దూకింది. అయితే ఘటనను గమనించిన స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించారు. సమీపంలో ఉన్న టీవీలు, ఫ్రిజ్‌ల కార్డ్‌బోర్డ్ బాక్స్‌లను వేగంగా తీసుకువచ్చి భవనం కింద అమర్చారు. యువతి నేరుగా ఆ బాక్స్‌లపై పడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే ఆమెను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రేమ సంబంధాల్లో ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని, సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు యువతకు సూచించారు.

## హరిపురంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డుకు ఘన ప్రారంభం...



ఓదెల//**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం, హరిపురం గ్రామంలో గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సీసీ రోడ్డుకు ఘనంగా శంకుస్థాపన జరిగింది. శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. తుమ్మల మల్లయ్య ఇంటి నుంచి తుమ్మల శేషమ్మ ఇంటి వరకు, అలాగే తుమ్మల బాపు ఇంటి నుంచి కర్రే స్వామి ఇంటి వరకు మొత్తం రూ.5 లక్షల వ్యయంతో ఈ సీసీ రోడ్డును నిర్మించనున్నారు. దీని ద్వారా గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరారు. గ్రామ ప్రజలు ఈ సీసీ రోడ్డుతో తమకు కలిగే సౌకర్యంపై హర్షం వ్యక్తం చేస్తూ, పనులు త్వరగా పూర్తి చేసి వినియోగానికి అందించాలని అధికారులను కోరారు.

## మహాశివరాత్రికి ముస్తాబైన ఏడుపాయల క్షేత్రం...



మెదక్//**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** ఉమ్మడి మెదక్ జిల్లాలో అతి పవిత్రమైన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల క్షేత్రం మహాశివరాత్రి జాతరకు అంగరంగ వైభవంగా సిద్ధమైంది. ఫిబ్రవరి 15 నుండి 17 వరకు మూడు రోజులపాటు జరగనున్న ఈ జాతరకు రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, సోలాపూర్ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. జాతరలో తొలి రోజు అయిన ఫిబ్రవరి 15న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రి జాగరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రెండవ రోజు అయిన 16న సాంప్రదాయబద్ధంగా బండ్లు తిరిగే కార్యక్రమం, మూడవ రోజు 17న రథోత్సవం భక్తులను ఆకట్టుకోనుంది. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



ఎండోమెంట్ ఈవో వీరేశం మాట్లాడుతూ ఇప్పటికే అన్ని శాఖల అధికారులు తమ తమ బాధ్యతల మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. మూడు రోజుల జాతరకు సుమారు 10 లక్షల మందికి పైగా భక్తులు విచ్చేస్తారని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాట్లు, తాత్కాలిక వైద్య శిబిరాలు, తాగునీటి సదుపాయాలు, భక్తుల రక్షణ కోసం పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు. మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయల క్షేత్రం భక్తులతో కిటకిటలాడనుంది.

## చాక్‌పీస్‌పై అద్భుత శివలింగం చెక్కిన ఆడెపు రజనీకాంత్...





ఓదెల//**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన ప్రభుత్వ చిత్రకళ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ తన అసామాన్య ప్రతిభను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు. సాధారణంగా కనిపించే చిన్న చాక్‌పీస్‌పై సూక్ష్మంగా,నాజూకుగా, అద్భుతమైన శిల్పకళతో శివలింగాన్ని చెక్కి భక్తులను ఆశ్చర్యపరిచారు. కేవలం 1.3 సెంటీమీటర్ల ఎత్తు, 1.5 సెంటీమీటర్ల వెడల్పుతో ఉన్న ఈ శివలింగాన్ని తయారు చేయడానికి గుండు పిన్ను సహాయంతో సుమారు గంటన్నర పాటు నిరంతర శ్రమించారు. చాక్‌పీస్ వంటి సున్నితమైన పదార్థంపై ఇంత సూక్ష్మంగా శిల్పాన్ని చెక్కడానికి అత్యంత నైపుణ్యం, ఓర్పు, ఏకాగ్రత అవసరం. అలాంటి లక్షణాలను కలిగి ఉన్న రజనీకాంత్ తన కళా ప్రతిభతో మహాశివరాత్రి పర్వదినానికి ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చారు. ఈ కళాఖండం గ్రామంలోని భక్తులకు విశేష ఆకర్షణగా నిలిచింది. శివుడిపై ఉన్న భక్తి, కళపై ఉన్న ప్రేమ కలిసినప్పుడు ఇలాంటి అపూర్వ కృతులు పుట్టుకొస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రజనీకాంత్ గతంలో కూడా శివరాత్రి సందర్భంగా 1.5 సెంటీమీటర్ల ఎత్తుతో 109 శివలింగాలను చాక్‌పీస్‌లపై చెక్కి ప్రశంసలు అందుకున్నారు. ప్రతి శివలింగాన్ని ఒకే పరిమాణంలో, ఒకే ఆకృతిలో రూపొందించడం ఆయన నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కృషి ఆయనను గ్రామస్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా ప్రసిద్ధి పొందేలా చేసింది. ఇంకా ఆయన ప్రపంచంలోనే అతి చిన్న జాతీయ జెండాను రూపొందించి "క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్"లో స్థానం సంపాదించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందారు. సూక్ష్మ కళలలో ఆయనకు ఉన్న ప్రతిభ అపారమని కళాభిమానులు పేర్కొంటున్నారు. చిన్న పదార్థాలపై పెద్ద భావాలను వ్యక్తపరచడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినప్పటికీ, తన ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదిగిన రజనీకాంత్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కృషి, పట్టుదల, సృజనాత్మకత ఉంటే ఎక్కడ నుంచైనా ప్రపంచ స్థాయికి ఎదగవచ్చని ఆయన నిరూపించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థుల్లో కూడా కళా నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. తన విద్యార్థులకు సూక్ష్మ కళలపై ఆసక్తి కలిగిస్తూ, వారిని కూడా సృజనాత్మక దిశగా నడిపిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా రూపొందించిన ఈ చాక్‌పీస్ శివలింగం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా మారడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో వచ్చి వీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌కు గ్రామ పెద్దలు, యువత, భక్తులు అభినందనలు తెలిపారు. ఆయన కళా ప్రతిభ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ శివుడిపై తనకు ఉన్న భక్తిని కళారూపంలో వ్యక్తపరచడం తనకు ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి ఒక ప్రత్యేక కళాఖండాన్ని రూపొందించడం తనకు అలవాటుగా మారిందన్నారు. భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో సూక్ష్మ కళాఖండాలను రూపొందించి దేశానికి పేరు తీసుకురావాలని సంకల్పం వ్యక్తం చేశారు. సూక్ష్మ కళలలో అపూర్వ ప్రతిభను చాటుతున్న ఆడెపు రజనీకాంత్ వంటి కళాకారులు గ్రామీణ ప్రాంతాల నుంచి వెలుగొందటం గర్వకారణమని కళాభిమానులు అభిప్రాయపడుతున్నారు. మహాశివరాత్రి పర్వదినాన భక్తి, కళ, సృజనాత్మకతల సమ్మేళనంగా నిలిచిన ఈ కళాఖండం పెద్దపల్లి జిల్లాలో విశేష చర్చనీయాంశంగా మారింది.

## నాగ్సాన్పల్లి గ్రామంలో ముస్తాబైన శివాలయం

### భక్తులతో కిటకిటలాడనున్న ఆలయ ప్రాంగణం..



పాపన్నపేట//**ఫిబ్రవరి 14 ఆకాంక్ష :** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పరిధిలోని నాగ్సాన్పల్లి గ్రామంలో ఉన్న ప్రాచీన శివాలయం మహాశివరాత్రి సందర్భంగా అద్భుతంగా ముస్తాబైంది. ఆలయ ప్రాంగణం చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు గుడి గోపురం, ప్రాంగణం అంతా రంగురంగుల లైట్ల కాంతులతో వెలుగొందుతోంది. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తుల రాకపోకలతో గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు రావనున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక శుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. శివలింగానికి పుష్పాలంకరణ, అభిషేకాలకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామ యువకులు, పెద్దలు కలిసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రేపు తెల్లవారు జామున నుంచే ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు ఆలయానికి చేరుకుని శివార్చనలు చేయనున్నారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించి అనంతరం దీక్ష విరమించుకునే కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో శివనామ స్మరణలు, భజనలు, జాగరణ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. ఈ ఆలయ అభివృద్ధికి భారత రాష్ట్ర సమితి (బి ఆర్ ఎస్) సీనియర్ నాయకుడు గంగారెడ్డి తన స్వంత నిధులతో ముందుకు వచ్చి ఆలయానికి పెయింటింగ్ పనులు, విద్యుత్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయించారు. ఆయన చేసిన సేవలకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి మరింత అందాన్ని తీసుకురావడంలో ఆయన పాత్ర కీలకమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. గ్రామ యువకులు తలారి సిద్దేందర్ ఆధ్వర్యంలో యువత కలిసి భక్తులకు తాగునీరు, ప్రసాదం, పార్కింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారుల మరమ్మతులు, శుభ్రత పనులు చేపట్టడం జరిగింది. మహిళలు కూడా ఉత్సాహంగా పాల్గొని ఆలయ పరిసరాలను అందంగా అలంకరించారు. గ్రామంలోని వృద్ధులు, మహిళలు, యువత ఒక్కటిగా కలిసి ఈ మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు. శివాలయంలో జరిగే పూజలు, భజనలు గ్రామ ప్రజల భక్తి పరవశాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు శివుని ఆశీస్సులతో గ్రామానికి శాంతి, సుఖసంపదలు కలగాలని ప్రార్థిస్తున్నారు. భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసే అవకాశమున్నందున భద్రతా ఏర్పాట్లు కూడా చేపట్టాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. రాత్రి జాగరణలో పాల్గొనే భక్తులకు కూర్చునే ఏర్పాట్లు, దీపాలంకరణ, సంగీత కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తానికి నాగ్సాన్పల్లి గ్రామంలోని శివాలయం మహాశివరాత్రి సందర్భంగా కాంతులతో కళకళలాడుతూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా సిద్ధమైందని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి అగ్రతాంబూలం

### గత వైఎస్సార్‌సీపీ పాలనలో అన్యాయానికి గురైన బీసీ వర్గాలకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు....

గత వైఎస్సార్‌సీపీ పాలనలో అన్యాయానికి గురైన బీసీ వర్గాలకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బీసీల అభివృద్ధి కోసం బడ్జెట్ చారిత్రాత్మకమైన నిధులను కేటాయిస్తూ, వారి ఆర్థిక, సామాజిక పురోభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బీసీలకు కేవలం రూ. 26 వేల కోట్లు మాత్రమే కేటాయించగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్‌ను భారీగా పెంచిందని వివరించారు. 2024-25: రూ. 39,000 కోట్లు, 2025-26: రూ. 47,000 కోట్లు, 2026-27: సుమారు రూ. 51,021 కోట్లు (బాహుబలి బడ్జెట్)ను కేటాయించారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈరోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల పుస్తకం కాదు.. ఇది ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిరూపం. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర భవిష్యత్తుకు ఒక అద్భుతమైన 'బ్లూప్రింట్' అని అన్నారు. రూ. 3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్, ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకొచ్చే ఒక 'విజన్ డాక్యుమెంట్'. ఇంతటి భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రికి, ఆర్థిక మంత్రికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com